PRGI Reg No -“APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం – ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...
ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 135, సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, ఆదివారం - 05 - జూలై - 2026 , వెల రూ.5/-

## దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా
# కుప్పాన్ని తీర్చిదిద్దుతా
### గూగుల్ కంటే ఇవే ఎక్కువ సంతోషం కలిగించాయి

గూగుల్ కంటే కుప్పం ప్రాజెక్టులే ఎక్కువ సంతోషాన్నిచ్చాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్య

కుప్పంలో రూ.9,322 కోట్ల విలువైన 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన

అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం

శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామి కవేత్తలు





అమరావతి: “గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, ఈ కార్యక్రమాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది” అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన మిగతా 2 లో




- హోంశాఖ పరిధిలోని పోలీస్, జైళ్ళ, ఫైర్, ఎస్పీఎఫ్ విభాగాల్లో నియామకాలు
- ఇప్పటికే 5 వేల పోస్టులకు జీవోలు జారీ.. మరో 2 వేలకు త్వరలో ఉత్తర్వులు
- ఆర్థిక శాఖ అనుమతులు రావడంతో నోటిఫికేషన్‌కు సిద్ధమైన టీఎస్ఎల్‌పీఆర్‌బీ
- రాష్ట్రం ఏర్పడ్డాక ఇది నాలుగో అతిపెద్ద పోలీస్ రిక్రూట్‌మెంట్

హైదరాబాద్: తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం

### తీవ్ర వేడికి భగభగమంటున్న అమెరికా..
## 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రద్దు!




250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారీ వేడుకలకు సిద్ధమైన అమెరికా

విపరీతమైన వేడి కారణంగా వేడుకలు రద్దు

తీవ్రంగా ప్రభావితమవుతున్న విద్యుత్ వ్యవస్థ

## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా
# అధికారిక ఆహ్వానం...
### ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా

జూలై 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన

ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు

సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మిగతా 2 లో

# కొత్త పేర్లు పంపే ప్రసక్తే లేదు
### పార్టీ పేరు మార్చాలంటూ ఈసీ ఆదేశం.. ఘాటుగా స్పందించిన కవిత

15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని కవితకు ఈసీ సూచన

కొత్త పేర్లు పంపకపోతే పార్టీ దరఖాస్తును క్లోజ్ చేస్తామని హెచ్చరిక




హైదరాబాద్: సొంత పార్టీ స్థాపనతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభించాలనుకున్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు కేంద్ర ఎన్నికల సంఘం మిగతా 2 లో

### ప్రియాంక గాంధీ వదిన వర్సెస్ 90 ఏళ్ల వృద్ధురాలు..
## ఉత్తరాఖండ్ భూవివాదంపై బీజేపీ దాడి!

ఉత్తరాఖండ్‌లో 4 హెక్టార్ల భూవివాదం

సాయిరా వాద్రా, నస్రీన్ మధ్య ల్యాండ్ ఫైట్

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆత్మాహుతి హెచ్చరిక

రాబర్ట్ వాద్రా బంధువులపై బీజేపీ ఆరోపణలు

ఉత్తరాఖండ్ హైకోర్టు సీరియస్ ఆదేశాలు

ఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని ఉధమ్ సింగ్ నగర్‌లో ఉన్న 4 హెక్టార్ల వివాదాస్పద భూమి చుట్టూ సాగుతున్న భూ వివాదం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా వదిన మిగతా 2 లో






## అమెరికా కథనాలన్నీ అవాస్తవం: ఇజ్రాయెల్

ఇరాన్ అగ్రనేతలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుందంటూ ఇటీవల న్యూయార్క్ టైమ్స్ కథనం

అమెరికా ఉప్పందించడంతో ఇరాన్ అప్రమత్తమైందని వెల్లడి

ఈ వార్తలను తీవ్రంగా ఖండించిన ఇజ్రాయెల్

పూర్తిగా అవాస్తవాలని వివరణ

# రాజకీయాల్లో 20 ఏళ్లు..
## భావోద్వేగ పోస్ట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి
### తెలంగాణ పునర్నిర్మాణ శ్రామికుడిగా పనిచేస్తానని హామీ



- రాజకీయాల్లో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఎనుముల రేవంత్ రెడ్డి నుంచి రేవంతన్నగా తన ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న సీఎం
- తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నారు. ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. తన సుదీర్ఘ ప్రయాణాన్ని మిగతా 2 లో



## రాయితీపై కంది విత్తనాల పంపిణీ
## స్వల్పకాలిక పంటల సాగుతోనే రైతులకు మేలు




యాడికి జూలై 04 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక: మండల పరిధిలోని రాయలచెరువు రైతు సేవా కేంద్రంలో శనివారం ఆత్మనిర్భరత పథకం కింద ఎల్ఆర్జీ 105, ఎల్ఆర్జీ 133-33 రకాల కంది విత్తనాలను రైతులకు రాయితీపై పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, వేములపాడు సొసైటీ అధ్యక్షులు నాగముని రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా మాట్లాడుతూ.. ప్రస్తుత ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు వీలుగా ప్రభుత్వం స్వల్పకాలిక పంటల సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని తెలిపారు. రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా తక్కువ కాల వ్యవధిలో చేతికొచ్చే పంటలను ఎంచుకోవాలని సూచించారు. అనంతరం మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న ఈ రాయితీ విత్తనాలను రైతులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని కోరారు. ఈ పంపిణీ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అధికారి పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, అలాగే స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

## 'రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం..'

**- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రాజానగరం నియోజకవర్గ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పురుషోత్తపట్నం తొర్రిగడ్డ పంపింగ్ స్కీము ద్వారా సాగునీటి విడుదల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, స్విచ్ ఆన్ చేసి సాగునీటిని అధికారికంగా విడుదల చేశారు. ఈ నీటి విడుదలతో కోరుకొండ, సీతానగరం మండలాల్లో సుమారు 20 వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనున్నది. దీంతో పంట పొలాలు జలకళ సంతరించుకుని, రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అన్నదాతలు ఇబ్బందులు పడకుండా సమయానికి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. రైతుల అభ్యున్నతికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం చేపడుతుందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, రైతులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వర్గీయ కొణిజేటి రోశయ్యను స్మరించుకున్న ఆర్యవైశ్యులు

**- వైశ్య భవన్లో ఘనంగా రోశయ్య జయంతి వేడుక**





ఒంగోలు, నేటి శుభోదయ ::: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ స్వర్గీయ డాక్టర్ కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు వైశ్య భవన్ నందు స్వర్గీయ రోశయ్య జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వైశ్య భవన్ నందు ఉన్న డాక్టర్ కొణిజేటి రోశయ్య విగ్రహానికి ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీనివాసులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లపోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే కొణిజేటి రోశయ్య అత్యధిక సార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకి మాత్రమే చెందుతుందని అన్నారు. నేటి రాజకీయ నాయకులకు ఆయన ఆదర్శవంతులని అన్నారు. మువ్వల శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్యవైశ్య ఆణిముత్యం డాక్టర్ కొణిజేటి రోశయ్య అని, అటువంటి పెద్దాయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు సమతలూరి సత్యనారాయణ, సుబ్బారావు, తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## త్వరలో కృష్ణా నదిపై సోలార్ బోట్లు



అమరావతి, నేటి శుభోదయ ::: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి సర్కార్ పర్యాటక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుంది, ఈ క్రమంలో కృష్ణానదిలో పర్యాటకులకు మరింత ఆహ్లాద కరమైన ప్రయాణ అనుభూతిని అందించేందుకు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ కొత్త అడుగు వేయనుంది. డీజిల్ బోట్లకు ప్రత్యామ్నాయంగా సోలార్ శక్తితో నడిచే మెకనైజ్డ్ బోట్లను ప్రవేశపెట్టాలని సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు జరిగిన ఏపీటీడీసీ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోగా సోలార్ బోటు నమూనాను కూడా సభ్యులకు ప్రదర్శించారు. ప్రయోగాత్మకంగా నాలుగు సోలార్ మెకనైజ్డ్ బోట్లను కొనుగోలు చేయాలని నిర్ణయిం చారు. విజయవాడ ప్రాంతంలో ఏడాది పొడవునా సూర్య కాంతి ఎక్కువగా లభించే పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ నాలుగు బోట్లను బెజవాడ డివిజన్‌కు కేటాయించనున్నారు. ప్రస్తుతం కృష్ణానదిలో పర్యాటక సేవల కోసం డీజిల్‌తో నడిచే మెకనైజ్డ్ బోట్లు వినియోగంలో ఉన్నాయి. డీజిల్ ధరల పెరుగుదలతో నిర్వహణ వ్యయం భారీగా పెరుగుతుండటంతో పాటు పర్యావరణ కాలుష్యం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో పర్యావరణహిత రవాణాను ప్రోత్సహిస్తూ సోలార్ బోట్ల ను అందుబాటులోకి తీసుకురావాలని ఏపీటీడీసీ నిర్ణయించింది.సాధారణ మెకనైజ్డ్ బోటు ధర సుమారు రూ. 30 లక్షలు కాగా సోలార్ మెకనైజ్డ్ బోటు ధర సుమారు రూ.50 లక్షలు ఉంటుంది. నాలుగు బోట్ల కొనుగోలుకు దాదాపు రూ.2 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇందుకోసం టెండర్లు లేదా కొటేషన్లు ఆహ్వానించి, తక్కువ ధరకు నాణ్యమైన బోట్లను అందించే సంస్థకు కాంట్రాక్టు ఇవ్వనున్నారు. ఒకటి నుంచి రెండు నెలల్లో ఈ బోట్లు అందుబాటు లోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. సోలార్ బోట్ల ప్రత్యేకత ఏమిటంటే.. ఇవి డీజిల్ బోట్లతో పోలిస్తే శబ్దం తక్కువగా చేస్తాయి. దీంతో పర్యాటకులు కృష్ణా నది సహజసౌందర్యాన్ని ప్రశాంత వాతావరణంలో ఆస్వాదించే అవకాశం ఉంటుంది.

# రిజిస్ట్రేషన్ వ్యవస్థలో భారీ సంస్కరణలు

**- రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలొస్తున్నాయ్**

**- దళారుల దందాకు చెక్, ఇక పారదర్శక సేవలే లక్ష్యం**

**సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట వేయనున్న ప్రభుత్వం**

అమరావతి, నేటి శుభోదయ :::ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూములు, ఇళ్లు, వాణిజ్య ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత తీసుకురావడంతో పాటు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏళ్లుగా కొనసాగుతున్న దళారుల వ్యవస్థకు ముగింపు పలికే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. "రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు (ఆర్ఎస్కే)" ఏర్పాటు చేసి, ప్రజలకు ఒకే చోట వేగవంతమైన, అవినీతి రహిత సేవలు అందించేందుకు కార్యాచరణ ప్రారంభించింది.ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే దళారులను ఆశ్రయించాల్సిందే అన్న పరిస్థితి నెలకొంది. అధికారిక రుసుములతో పాటు వేల రూపాయలు అదనంగా చెల్లించాల్సి వస్తోందని ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో కొత్త విధానం తీసుకొచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిగా డిజిటల్, పారదర్శకంగా మార్చేందుకు చర్యలు చేపడుతోంది.

- ప్రభుత్వ ఆలోచన ఇదే

స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చే శాఖల్లో ఒకటి. ప్రతి సంవత్సరం వేలాది ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నప్పటికీ, మధ్యవర్తుల ఆధిపత్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అనవసర ఖర్చులు, ఆలస్యం, తప్పుడు సమాచారం, అక్రమ వసూళ్లు, నకిలీ పత్రాల ఆరోపణలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి.

ఈ పరిస్థితిని మార్చి, ప్రభుత్వ సేవలను నేరుగా ప్రజలకు అందించడమే ఆర్ఎస్కే వ్యవస్థ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది.

- ఇక ప్రక్రియ ఎలా ఉంటుంది..

కొత్త విధానంలో, దస్తావేజులు ప్రభుత్వ నమూనాలోనే తయారవుతాయి. ఆన్‌లైన్‌లో చలానా చెల్లింపు. ముందస్తు స్లాట్ బుకింగ్.కేవైసీ, బయోమెట్రిక్ ధృవీకరణ. వేగవంతమైన రిజిస్ట్రేషన్.అన్ని రికార్డులు డిజిటల్ రూపంలో భద్రపరిచే వ్యవస్థ. ప్రజలు సేవా కేంద్రంలో దస్తావేజు సిద్ధం చేసుకుని, నిర్ణయించిన సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి బయోమెట్రిక్, ధృవీకరణ పూర్తి చేస్తే వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా వ్యవస్థ రూపొందిస్తున్నారు.

- దళారుల దందాకు బ్రేక్ పడుతుందా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దళారుల హవా చాలా కాలంగా కొనసాగుతోంది. ఏ పత్రం ఎలా తయారు చేయాలి? ఎంత ఫీజు? ఏ ప్రక్రియ అనేది తెలియక ప్రజలు పూర్తిగా వారి మీదే ఆధారపడుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని కొందరు భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఎస్కేలు ప్రారంభమైతే ప్రభుత్వం నిర్ణయించిన రుసుములతోనే సేవలు అందుబాటులోకి రావడం వల్ల అక్రమ వసూళ్లు తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

- ప్రభుత్వానికీ లాభమే

కొత్త విధానం వల్ల, ప్రభుత్వ ఆదాయం మరింత పారదర్శకంగా నమోదు అవుతుంది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం తగ్గుతుంది.డిజిటల్ రికార్డుల వల్ల వివాదాలు తగ్గే అవకాశం ఉంటుంది. ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం పెరుగుతుంది.అవినీతికి అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి.

- పీపీపీ విధానంలో సేవా కేంద్రాలు

రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో నిర్వహించనున్నారు. ప్రభుత్వం ఎంపిక చేసిన సంస్థలు సిబ్బందిని నియమించి సేవలు అందిస్తాయి. దస్తావేజుల తయారీకి సుమారు రూ.2,000 సేవా రుసుము వసూలు చేసే ప్రతిపాదన ఉంది.

- ఏం మారబోతోంది..

పాత విధానం,దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి,అధిక ఖర్చులు,జాప్యం, అవినీతి ఆరోపణలు,

పారదర్శకత లోపం.

- కొత్త విధానం

సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ పర్యవేక్షణ.ముందస్తు స్లాట్ బుకింగ్,డిజిటల్ డాక్యుమెంట్లు,నిర్ణీత సేవా రుసుము,వేగవంతమైన రిజిస్ట్రేషన్,పారదర్శక సేవలు.

- ప్రజలు ఏమంటున్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మధ్యవర్తుల ప్రమేయం తగ్గి, నిర్ణీత రుసుముతో వేగంగా పని పూర్తయితే సామాన్య ప్రజలకు ఎంతో ఊరట లభిస్తుందని కొనుగోలుదారులు, విక్రేతలు అభిప్రాయ పడుతున్నారు.

అయితే సేవా కేంద్రాలు నిజంగా దళారుల రహితంగా పనిచేయాలంటే కఠిన పర్యవేక్షణ, సాంకేతిక పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థ తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు.

- నేటి శుభోదయ విశ్లేషణ

రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు ప్రభుత్వ పరిపాలనా సంస్కరణల్లో కీలక అడుగుగా చెప్పవచ్చు. అయితే కేంద్రాల ఏర్పాటు ఒక్కటే సరిపోదు. వాటి నిర్వహణ పారదర్శకంగా ఉండాలి. ప్రతి సేవకు నిర్ణీత రుసుము స్పష్టంగా ప్రదర్శించాలి. ఫిర్యాదు వ్యవస్థను బలోపేతం చేయాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించాలి. అప్పుడే ఈ సంస్కరణ నిజమైన ఫలితాన్ని ఇస్తుంది.

## రైతు వ్యతిరేక విధానాలను దేశ ప్రజలు ప్రతిఘటించాలి

**- ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టివేత.అఖిల భారత కిసాన్ సభ ( ఏఐకేఎస్) జాతీయ ఉపాధ్యక్షులు టి.సాగర్ విమర్శ**




ఏలూరు, నేటి శుభోదయ ::: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక, వ్యవసాయ విధానాలు దేశ రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని అఖిల భారత కిసాన్ సభ ( ఏఐకేఎస్) జాతీయ ఉపాధ్యక్షులు టి. సాగర్ తీవ్రంగా విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలను ప్రారంభిస్తూ ఎఐకెఎస్ జాతీయ ఉపాధ్యక్షులు టి సాగర్ ప్రారంభ ఉపాన్యాసం చేశారు. ఈ మహాసభ ఏలూరులోని డిసిఎంఎస్ ఫంక్షన్ హాలు (వై.జోయా, బడా సుబ్బారెడ్డి నగర్) లో జరుగుతున్న రాష్ట్ర మహాసభలకు అధ్యక్ష వర్గంగా వి.కృష్ణయ్య, బి.రాంబాబు, ఎం. అప్పలరాజు, హేమలత అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ప్రారంభ సభలో సాగర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విదేశీ వాణిజ్య ఒప్పందాల పేరుతో అమెరికా, బ్రెజిల్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాల నుండి నూనెగింజలు, వంటనూనెలు, ప్రత్తి, మొక్కజొన్న, పాల ఉత్పత్తుల దిగుమతులకు సుంకాలను తగ్గించడం వల్ల దేశీయంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే వంట నూనెకు 27 శాతం దిగుమతి సుంకం ఉండగా అమెరికా ఉపాధ్యక్షులు జేడీ వ్యాన్స్ పర్యటనలో భాగంగా 17 శాతం సుంకం తగ్గించారని దీని వల్ల విదేశాల నుండి నూనె దిగుమతి ఐతే దేశంలో పండించే అయిల్ పామ్ , వేరుశెనగ, నువ్వులు, సన్ ఫ్లవర్ కొబ్బరి వంటి పంటలు పండించే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందంలో మన దేశంలోకి దిగుమతి అయ్యే పత్తి 11 శాతం సుంకం తీసివేస్తున్నారని దీనివల్ల మన దేశానికి 40 లక్షల వేల పత్తి దిగుమతి అయితే ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర, తెలంగాణాలో పంటలు పండించే రైతులకు నష్టాలలో కూరుకు పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పాల ఉత్పత్తిదారులు 10 కోట్ల మంది పాడి రైతులు ఉంటే విదేశాల్లో ఉన్న పాలను దిగుమతి చేసుకునేలా ఒప్పందం చేసారన్నారు. ఈ ప్రభావం పాడి రైతులతో పాటు సహకార సంఘాలు, అమూల్, హెరిటేజ్, విశాఖడైరీ, సంఘం డైరీ ఇలాంటి వాటితో పాటు కోట్ల కుటుంబాలు రోడ్లపై వచ్చేలా ఒప్పందాలు ఉన్నాయన్నారు.మొక్కజొన్న ప్రస్తుతం ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ నిర్ణయాలు మరింత దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల ప్రభావంతో చమురు, గ్యాస్ ధరలు పెరిగి వ్యవసాయ పెట్టుబడి వ్యయం భారీగా పెరిగిందన్నారు. డీజిల్, ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరలు పెరగడంతో రైతులపై అదనపు భారం పడుతుండగా, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సాధారణ ప్రజల జీవనం కష్టతరమైందని చెప్పారు. దేశంలోని కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, అన్నదాతలైన రైతుల రుణాలను మాత్రం మాఫీ చేయడానికి ముందుకు రావడం లేదని మండిపడ్డారు. దేశానికి ఆహారం పండించే రైతులను నిర్లక్ష్యం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలన సాగించడం దురదృష్టకరమన్నారు. రైతులను అప్పుల ఊబి నుంచి బయటపడేయడానికి కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు రుణ విముక్తి చట్టం తరహా విధానాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తి రుణమాఫీ, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధ హామీ, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర, వ్యవసాయ పెట్టుబడుల నియంత్రణ వంటి చర్యలను వెంటనే చేపట్టాలని కోరారు. రైతాంగం, కార్మికులు, వ్యవసాయ కూలీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు కలిసి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు అవసరమన్నారు.అలాగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 23వ రాష్ట్ర మహాసభలను ఏలూరులో విజయవంతంగా నిర్వహిస్తున్న ఆహ్వాన సంఘానికి సాగర్ ప్రత్యేకంగా అభినందించారు. మహాసభల విజయంతో రైతు ఉద్యమాలకు కొత్త ఉత్సాహం లభించిందని, రైతాంగ హక్కుల సాధన కోసం మరింత విస్తృత ఉద్యమాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ఉభయ గోదావరి జిల్లా టీచర్స్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఏలూరు చారిత్రకంగా రైతు ఉద్యమాల కేంద్రంగా ఉందన్నారు. ఏలూరులో ఈ మహాసభల నిర్వహణ ద్వారా భవిష్యత్ రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశించేయడం ద్వారా ఈ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సంతాప్ తీర్మానాన్ని ఎం. సూర్యనారాయణ ప్రవేశపెట్టారు. ఈ సభలో రైతు కూలీ సంఘం జాతీయ నాయకురాలు ఝాన్సీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డి. రమాదేవి,సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వి నాగేశ్వరరావు సౌహార్ద సందేశాలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకులు వై. కేశవరావు,చేపల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నంబూరి రామరాజు (తాడినాడ బాబు), ఆయిల్ పామ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వంకినేని రంగారావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి బలరాం,కార్యదర్శి ఎం.హరిబాబు,వ్యవసాయ కార్మిక సంఘం పూర్వ రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కె. శ్రీనివాస్, శివశంకర్, ఆంజనేయులు, చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రావు, రామకృష్ణ, రాజశేఖర్ వతో పాటు, కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. రామకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డివిస్విడి ప్రసాద్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎం.నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మహాసభలో ప్రారంభ సూచనగా రైతు సంఘం జెండాను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపం వద్ద పూలు వేసి మొదట అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ అమరవీరులకు జోహార్లు అర్పించారు. మన్య విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు.

## వైసీపీ నాయకులు సంజీవ రాయుడు మృతి పట్ల అనంత సంతాపం



అనంతపురం బ్యూరో జూలై 04 నేటి శుభోదయ :నగరంలోని నవోదయ కాలనీకి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు సంపంగి సంజీవ రాయుడు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.మృతిని కుటుంబీకులతోపాటు మృతుని సోదరులు మాజీ కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులను పరామర్శించి ఓదార్చారు.పార్టీ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.అదే విధంగా వైసీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి,మాజీ మేయర్ మహమ్మద్ వసీం లు సైతం సంజీవ రాయుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వీరి వెంట వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఒబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'తాడేపల్లిగూడెం రోడ్లు, డ్రైన్లు, పార్కుల అభివృద్ధికి రూ. 7.95 కోట్లు మంజూరు చేసిన పురపాలక శాఖ మంత్రి నారాయణ"



తాడేపల్లిగూడెం జూలై 4 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::ఏలూరు పురపాలక సంఘం కార్యాలయం లో కమిషనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తాడేపల్లిగూడెం అభివృద్ధికి భారీ నిధులు మంజూరు చేశారు.తాడేపల్లిగూడెం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ విజ్ఞప్తి మేరకు తాడేపల్లిగూడెంలో రోడ్లు, డ్రైన్లు, పార్కుల అభివృద్ధి కొరకు 7.95 కోట్లు మంజూరుచేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.ఈ సదస్సుకు కమిషనర్ల అసోసియేషన్ అధ్యక్షులు మరియు రీజినల్ డైరెక్టర్ నాగ నరసింహారావు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మరియు తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ యేసుబాబు తో పాటు తణుకు, భీమవరం, ఆకివీడు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.సదస్సు అనంతరం అందరు కమిషనర్లు కలిసి పురపాలక శాఖ మంత్రి నారాయణ ఘనంగా శాలువా, పూలమాలతో సన్మానించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూపట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంజూరు చేసిన నిధులతో నాణ్యతతో కూడిన పనులు త్వరగా పూర్తి పూర్తి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన రోడ్లు, డ్రైనేజీ, పార్కుల సౌకర్యాలు అందుబాటులోకి తేవాలి అని కమిషనర్లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు పట్టణాల మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## కూటమి పాలనే రాయలసీమ అభివృద్ధికి చిరునామా

**సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాయలసీమ అభివృద్ధికి కీలక అడుగులు**

**గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాయలసీమకు చేసిన అభివృద్ధి శూన్యం.**

**రాయలసీమ ప్రజల వెనుకబాటుకు వైసీపీనే ప్రధాన కారణం**

**సీమ ప్రజలకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్ రెడ్డి**

**పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



అనంత పురం బ్యూరో జూలై: 4 నేటి శుభోదయ: రాయలసీమ సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఎన్నో పారిశ్రామిక, వ్యవసాయ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. రాయలసీమలోని కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె లో రూ.16,350 కోట్ల వ్యయంతో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండుసార్లు శంకుస్థాపన చేసినప్పటికీ స్టీల్ ప్లాంట్ పనులు కనీసం అంగుళం కూడా ముందుకు సాగలేదని విమర్శించారు. ఆ ప్రాంతంలో మొలచిన కంపచెట్లు,పిచ్చిమొక్కలు తొలగించడానికి కూడా చర్యలు తీసుకోలేదని విమర్శించారు.గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జీఓ నెం. 365 ద్వారా సుమారు 102 సాగునీటి ప్రాజెక్టులను రద్దు చేసి రాయలసీమ రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. అందుకే రాయలసీమ వెనుకబాటుకు వైసీపీ ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రూ.33 వేల కోట్లతో రాయలసీమ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపడుతూ వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిస్తున్నారని తెలిపారు. నీటి వనరుల అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే పెనుకొండ ప్రాంతంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కియా కార్ల పరిశ్రమ విజయవంతంగా కొనసాగుతుండగా, పుట్టపర్తిలో రెండు లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో ఐదవ తరం ఫైటర్ జెట్ పరిశ్రమ, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు, చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్, హీరో ద్విచక్ర వాహనాల తయారీ యూనిట్లు, యాపిల్ ఫోన్ తయారీ పరిశ్రమలు, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు రాయలసీమను దేశంలోనే ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దనున్నాయని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు.కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాయలసీమకు నూతన దిశను చూపిస్తోందని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పష్టం చేశారు.

## యంఐజి లేఅవుట్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**ఈ నెలాఖరులోపు మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని మంత్రి నారాయణ ఆదేశం**



ఏలూరు, నేటి శుభోదయ ::: ఏలూరు నగరానికి సమీపంలోని శనివారపుపేట యంఐజి లేఅవుట్‌ను త్వరితగతిన అభివృద్ధి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం లేఅవుట్‌ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి పరిశీలించిన మంత్రి, అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. లేఅవుట్‌లో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం వంటి మౌలిక సదుపాయాలను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్న సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్న మంత్రి, ఇప్పటికే కొనుగోలు చేసిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన ప్లాట్లను త్వరలోనే బహిరంగ వేలం ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో యంఐజి లేఅవుట్ అభివృద్ధి పనులు మరింత వేగం పుంజుకోనున్నాయని అధికారులు తెలిపారు.

## నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు బొల్లా బ్రహ్మనాయుడు

**యాగంటి మల్లికార్జున రావు**

మాచర్ల, నేటి శుభోదయం-4 (పల్నాడు జిల్లా) పల్నాడు జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను చూసి వైసీపీ నాయకులకు భయం పట్టుకుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యాగంటి మల్లికార్జున రావు అన్నారు. మాచర్ల పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఇటీవల నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన నాయకులు ఇప్పుడు అసత్య ప్రచారం, వ్యక్తిగత విమర్శలనే రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని అన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వల్ల నిజాలు మారవని, ప్రజలకు సమాధానం చెప్పలేని వారు మీడియా ముందు సంచలన వ్యాఖ్యలు చేసినా ప్రజలు నమ్మే రోజులు పోయాయని పేర్కొన్నారు. ఏవైనా ఆరోపణలు ఉంటే చట్టబద్ధ సంస్థల ముందు ఆధారాలతో ఉంచాలని, లేనిపక్షంలో అవి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ నాటకాలుగానే మిగిలిపోతాయని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతుంటే వాటిని ఎదుర్కోలేక వైసీపీ నాయకులు విష ప్రచారానికి దిగుతున్నారని, ప్రజా సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక వ్యక్తిగత విమర్శలతో రాజకీయ ఉనికిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బొల్లా బ్రహ్మనాయుడు తనపై ఉన్న కేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించి



అడ్డంగా దొరికిన మాట వాస్తవం కాదా? తెలంగాణ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఎమ్మార్వో సంతకాలు ఫోర్జరీ చేసి గండిపేటలో ప్రభుత్వ భూమిని కాజేయాలని ప్రయత్నించి కేసులు ఎదుర్కొన్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నువ్వు జైలుకు వెళ్లడానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు ఏం సంబంధమని బొల్లా బ్రహ్మనాయుడిని ప్రశ్నించారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ పల్నాడు జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువస్తూ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న వ్యక్తి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలని కొనియాడారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తన విజ్ఞాన్ యూనివర్సిటీలో ఉచిత విద్యను అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న విద్యాదాత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మంచి జీవితం అందించాలని చూస్తున్న ఎంపీ ఒకవైపు ఉంటే, 2019-24 మధ్య వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో బొల్లాపల్లి, ఈపూరు, వెల్లటూరు, వినుకొండ ప్రాంతాల్లో వెంచర్లు, ఎస్సీ, ఎస్టీ భూములను దౌర్జన్యంగా ఆక్రమించి వారికి అన్యాయం చేసింది నువ్వు కాదా బొల్లా బ్రహ్మనాయుడు అని ప్రశ్నించారు. అక్షరజ్ఞానం లేని నువ్వు కోట్లాది రూపాయలు ఎలా సంపాదించావు పాలు, పెరుగు అమ్మి సంపాదించావా? అని నిలదీశారు. అవినీతి మరకలేని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలపై వైసీపీకి బ్రాండ్‌గా మారిన లిక్కర్ కేసుల మరకను అంటించాలని చూస్తున్నారని విమర్శించారు. ఢిల్లీని మించిన లిక్కర్ స్కామ్ వైసీపీ పాలనలో జరిగిందని దేశమంతా చర్చించుకుంటోందని అన్నారు. లిక్కర్ కేసుల్లో పలువురు వైసీపీ నాయకులు జైలుకు వెళ్లిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. లిక్కర్ వ్యాపారాలతో ఎలాంటి సంబంధం లేని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలపై నిరాధార ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నిస్వార్థంగా పల్నాడు ప్రజలకు సేవ చేయడానికి, రాష్ట్ర అభివృద్ధి కోసం రాజకీయాల్లోకి వచ్చారే తప్ప అక్రమ సంపాదన కోసం కాదని పేర్కొన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలపై చేసిన అసత్య ఆరోపణలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బొల్లా బ్రహ్మనాయుడిని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు, కూటమి నాయకులు తగిన విధంగా బుద్ధి చెబుతారని యాగంటి మల్లికార్జున రావు హెచ్చరించారు.

## పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ...!

**నిర్మాణ సారథుల కమిటీకి అర్జీని సమర్పించిన.. అడపా శ్రీనివాస్..!!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); జనసేన పార్టీ అధ్యక్షులు కొనదేల పవన్ కళ్యాణ్ చారిత్రాత్మకంగా చేపట్టిన నిర్మాణ సారుదుల దరఖాస్తుల ప్రక్రియకు రాజానగరం నియోజకవర్గం ఆ పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్ (బూరుగుపూడి డాక్టర్) తన దరఖాస్తుల సమర్పించారు. ఈ విషయాన్ని శనివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటనలో మీడియాకు తెలిపారు. గ్రామస్థాయిలో., కార్పొరేటర్ స్థాయిలో, జిల్లా స్థాయిలో.., రాష్ట్ర స్థాయిలో పోరాడే నాయకులు, సేవ కార్యక్రమాలు చేసే నాయకులు, పార్టీకి కష్టపడి పనిచేసిన నాయకులే.. నా జనసేన పార్టీకి కావాలని ఒకప్పుడు మాట్లాడిన.. పవన్ కళ్యాణ్.. ఆ మాటకి కట్టుబడి నేడు దేశంలోనే వినూత్నంగా ఈ కార్యక్రమాలు చేపట్టడం ఎంతో హర్షనీయమన్నారు. 25 జిల్లాలలో, పార్లమెంటు స్థానాలలో.. జనసేన నిర్మాణ సారథులు సమాచార సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి...అబ్జర్వర్ లను నియమించి.. కష్టపడిన జనసైనికులను... వాళ్లకు కావలసిన పదవులను.. అర్జీ రూపంలో తీసుకుని.. వాళ్ళ పోరాటపటిమను.. సేవా కార్యక్రమాలను.. అర్జీ రూపంలో తెలియపరచండి అని పిలుపునివ్వడం జనసైనికులలో నూతన ఉత్తేజం కలిగించిందన్నారు. ఆసక్తి ఉన్నవారి నుంచి అర్జీలను తీసుకొని రేపు రాబోయే రోజుల్లో.. పార్లమెంటు... జిల్లా.. మరియు గ్రామ. మండల. స్థాయిలో అర్హత కలిగిన వాళ్ళందరికీ కూడా పదవులు ఇచ్చే విధంగా రాష్ట్ర నాయకత్వం.. జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ తీసుకునే నిర్ణయం భారతదేశంలో ఎక్కడ జరగలేని విధంగా. కొత్త ధనాన్ని తీసుకొచ్చినటువంటి.. పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేసుకుంటున్నానని రాజానగరం జనసేన సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్ (బూరుగుపూడి డాక్టర్) ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## భద్రాద్రి గ్రీన్‌ఫీల్డ్"ఎయిర్‌పోర్టు"లో కీలక అడుగులు

**- సీతంపేట, సుజాతనగర్‌లే అనుకూల ప్రాంతాలుగా గుర్తింపు- కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడుకు నివేదిక పంపిన మంత్రి తుమ్మల- 667 ఎకరాల్లో నిర్మాణానికి అవకాశం - ఆరు ప్రాంతాల్లో సాధ్యాసాధ్యాల అధ్యయనం**



ఖమ్మం, నేటి శుభోదయ ::: దశాబ్దాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లావాసులు ఎదురుచూస్తున్న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కల సాకారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఇప్పటికే ప్రతిపాదించిన స్థలాలు సాంకేతిక, ఆర్థిక కారణాలతో అనుకూలం కాదని తేలడంతో, జిల్లా యంత్రాంగం ద్వారా ప్రత్యామ్నాయ స్థలాలపై చేపట్టిన సమగ్ర సాధ్యాసాధ్యాల అధ్యయన నివేదికను వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రాంమోహన్ నాయుడుకు అందజేశారు. ఈ మేరకు జులై 4నమంత్రి తుమ్మల లేఖ రాశారు. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై గతంలో తాను పంపిన లేఖలను ప్రస్తావిస్తూ, తాజా పరిణామాలను ఇందులో వివరించారు.

### - రెండు పాత ప్రతిపాదనలకు అడ్డంకులు

కొత్తగూడెం సమీపంలో గతంలో ప్రతిపాదించిన రెండు స్థలాల్లో ఒకటి సాంకేతికంగా, మరొకటి ఆర్థికంగా(భూసేకరణకు) అనుకూలం కాదని తేలడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. దీంతో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సూచన మేరకు జిల్లా యంత్రాంగం స్వతంత్ర సాంకేతిక సంస్థ 'రాజ్ టెక్నాలజీస్'ను రంగంలోకి దించి, సాంకేతికంగా, ఆర్థికంగా అనుకూలమైన కొత్త స్థలాలను గుర్తించే బాధ్యతను అప్పగించింది. ఇటీవల ఢిల్లీలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర మంత్రిని కలిసినప్పుడు, కొత్త స్థల ప్రతిపాదనపై పది రోజుల్లో ఫీజిబిలిటీ నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ మేరకు నిర్దేశిత గడువులోగానే నివేదికను సిద్ధం చేసి కేంద్రానికి పంపడం గమనార్హం.

### - ఆరు ప్రాంతాల పరిశీలన

రెండు స్థలాలు ఖరారు ఏటీఆర్-72-600 తరహా విమానాలకు అనుగుణంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో భూమి లభ్యత, భూతల స్వరూపం, రన్‌వే దిశ, ఎత్తు పరిమితి ఉపరితలాలు (అబ్‌స్టకల్ లిమిటేషన్ సర్ఫేసెస్), పర్యావరణ అంశాలు, రవాణా సౌకర్యాలను నిపుణుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ ప్రాథమిక సాధ్యాసాధ్యాల అధ్యయనంలో సీతంపేట, సుజాతనగర్ ప్రాంతాలు అవసరమైన కీలక సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా, అనుకూలమైన భూతలం, భూవినియోగం, నిర్వహణ పరిస్థితులతో ఉన్నట్లు తేలింది. సుమారు 667 ఎకరాల ప్రతిపాదిత అభివృద్ధి స్థలాన్ని ఎలాంటి ప్రధాన పర్యావరణ, సాంకేతిక అవరోధాలు లేకుండానే సమకూర్చవచ్చని నివేదిక స్పష్టం చేసింది. దీంతో ఏళ్లుగా నానుతున్న స్థల నిర్ధారణ సమస్యకు తెరపడే అవకాశం కనిపిస్తోంది.

### - జిల్లా ప్రాధాన్యతను వివరించిన మంత్రి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యూహాత్మక ప్రాంతంలో ఉండటమే కాక, విశాలమైన గిరిజన, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోందని మంత్రి తుమ్మల తన లేఖలో పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, బీపీఎల్ వంటి ప్రముఖ పారిశ్రామిక సంస్థలకు ఈ జిల్లా నిలయంగా ఉందని వివరించారు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి క్షేత్రానికి ఏటా లక్షలాది మంది భక్తులు దేశ, విదేశాల నుంచి తరలివస్తుంటారని, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వారి ప్రయాణం మరింత సులభతరమవుతుందని తెలిపారు. అంతేకాక, జిల్లాలోని అటవీ సంపద, ఖనిజ వనరులు, ఎకో టూరిజం అవకాశాలు, ప్రతిపాదిత ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులకు విమానాశ్రయం మరింత బలం చేకూరుస్తుందని, తద్వారా పెట్టుబడులు పెరిగి విద్యా, పారిశ్రామిక, పర్యాటక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు.

### సంపూర్ణ సహకారం అందిస్తామన్న మంత్రి

ఫీజిబిలిటీ నివేదికను దయచేసి పరిగణనలోకి తీసుకుని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని తుమ్మల తన లేఖలో అభ్యర్థించారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని విధాలుగా సంపూర్ణ సహకారం అందిస్తాయని హామీ ఇచ్చారు. ఫీజిబిలిటీ అధ్యయన నివేదిక ప్రతిని కూడా లేఖతో పాటు కేంద్ర మంత్రికి జతచేసినట్లు తెలిపారు.

### త్వరలో వాస్తవరూపం దాల్చనున్న చిరకాల స్వప్నం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లావాసుల దశాబ్దాల కల అయిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, తాజా పరిణామాలతో సాకారానికి మరింత చేరువైందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కేంద్రం నుంచి తుది ఆమోదం లభిస్తే, గిరిజన, పారిశ్రామిక, పుణ్యక్షేత్ర ప్రాధాన్యత కలిగిన ఈ జిల్లాకు గగనతల అనుసంధానం ఏర్పడి, ప్రాంతీయ ఆర్థిక ముఖచిత్రమే మారిపోనుందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

## యాడికిలో విద్యుత్ అధికారుల ఘోర నిర్లక్ష్యం

**ప్రమాదపు అంచున కాలనీవాసుల ప్రాణాలు!**



యాడికి జూలై 04 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని అంకాలమ్మ వీధి పీర్ల చావిడి పక్కన విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అక్కడ ఉన్న విద్యుత్ సిమెంట్ స్తంభం పూర్తిగా పుచ్చిపోయి, కింది భాగం ఊడిపోయి ఏ క్షణంలోనైనా కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నా.. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. స్థానికుల ప్రాణాలంటే అధికారులకు అంత చులకనా అంటూ కాలనీవాసులు మండిపడుతున్నారు. స్తంభానికి పక్కనే ఇళ్లు, దుకాణాలు ఉండటమే కాకుండా, చిన్నపిల్లలు నిత్యం పాఠశాలలకు వెళ్లే ప్రధాన దారి ఇది. ఇంతటి జనసంచారం ఉన్న ప్రాంతంలో అత్యంత ప్రమాదకరంగా మారిన స్తంభాన్ని చూస్తూ కూడా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. కొద్దిపాటి గాలి వస్తేనే కుప్పకూలేలా ఉన్న ఈ స్తంభం వల్ల ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని స్థానికులు గుండెచేత్తో పట్టుకుని బతుకుతున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత గానీ అధికారుల కళ్లు తెరుచుకుంటాయా అని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే ఆ పాత స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు...

## సిమెంట్ ఆధ్వర్యంలో 1,150 మందికి ఉచిత కళ్లజోళ్లు పంపిణీ



పెదగార్లపాడు (4): పల్నాడు దాచేపల్లి పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో శ్రీ సిమెంట్ లిమిటెడ్ -- పెదగార్లపాడు యూనిట్, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) కార్యక్రమంలో భాగంగా శ్రీ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా, శ్రీ ఐ కేర్ సెంటర్, విజయవాడ సహకారంతో పెదగార్లపాడు, కాచవరం, తుమ్మలచెరువు, ఇంపరాజుపల్లి గ్రామాల్లో ఉచిత నేత్ర పరీక్షా శిబిరాలను నిర్వహించింది. ఈ శిబిరాల్లో మొత్తం 1,650 మంది గ్రామస్తులకు నేత్ర పరీక్షలు నిర్వహించగా, వారిలో 1,150 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు గుర్తించారు. వైద్యుల సూచనల మేరకు అర్హులైన లబ్ధిదారులకు గత రెండు రోజులుగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానికుల సమక్షంలో ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రజలు లబ్ధి పొందారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న అనేక మంది వృద్ధులు తమ రోజువారీ పనులను స్వయంగా చేసుకునే స్థితికి చేరుకోగా, విద్యార్థులు స్పష్టమైన చూపుతో తమ చదువును మరింత మెరుగ్గా కొనసాగించగలుగుతున్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ లక్ష్మీనారాయణ సమన్వయంతో, శ్రీ సిమెంట్ లిమిటెడ్ -- పెదగార్లపాడు యూనిట్ హెడ్ శ్రీ అరుణ్ అగర్వాల్, హెడ్ -- హెచ్‌ఆర్ శ్రీ కదంబాల శ్రీనివాస్ రావు వారి నాయకత్వంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, లబ్ధిదారులు శ్రీ సిమెంట్ లిమిటెడ్, శ్రీ ఫౌండేషన్ ట్రస్ట్, శ్రీ ఐ కేర్ సెంటర్, విజయవాడలకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రజోపయోగ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## అల్లూరి సీతారామరాజు ప్రదర్శించిన ధైర్యం, త్యాగం, దేశభక్తి అందరికీ మార్గదర్శకం



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద, శనివారం ఉదయం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర, సిబ్బంది తో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య పోరాటంలో తన ప్రాణాలను అర్పించి, దేశానికి అపూర్వమైన స్ఫూర్తినిచ్చిన మహానుభావుడని, దేశభక్తి, ధైర్యసాహసాల పరాకాష్ఠగా నిలిచిన ఆయన జీవితం ప్రతి భారతీయుడికి మార్గదర్శకమని పేర్కొన్నారు. నేటి యువత అతని స్ఫూర్తిని అనుసరించి దేశసేవలోకి ముందుకు రావాలని, ప్రజల సేవ చేయడం ద్వారా నిజమైన దేశభక్తిని చాటాలని అన్నారు. అల్లూరి సీతారామరాజు మన దేశ చరిత్రలో స్వాతంత్ర్య సమరయోధుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారని, అతని ధైర్యం, త్యాగం, దేశభక్తి మనకు ఎప్పటికీ పాఠాలుగా ఉంటాయని, అటువంటి మహానుభావుడికి నివాళులు అర్పించడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఎ. రవీంద్ర రావు, చీఫ్ ఇంజినీర్ పి. సత్యకుమారి, అకౌంట్ ఆఫీసర్ బి. సత్యనారాయణ మూర్తి, మేనేజర్ ప్రభావతి, విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వజ్ఞ విద్యా సంస్థలో ఘనంగా వనమహోత్సవం నిర్వహణ




ఖమ్మం, నేటి శుభోదయ ::: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా సర్వజ్ఞ విద్యాసంస్థలో వనమహోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి వివిధ రకాల నీడనిచ్చే, ఫలవృక్షాలు, ఔషధ మొక్కలను నాటారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని దాని సంరక్షణకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ఆర్. వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ "నేటి మొక్కలే రేపటి జీవనాధారం. పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి. ప్రకృతిని రక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలం" అని అన్నారు. సంస్థ డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రకృతి పట్ల ప్రేమ, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహద పడతాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ అందరిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని వనమహోత్సవాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయ గో సంరక్షణ విభాగానికివిరాళం అందజేత



విజయవాడ, జూలై 3 (నేటి శుభోదయ):- శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయ గో సంరక్షణ విభాగానికి తెనాలి కి చెందిన ఆలపాటి శ్రీకర్ దంపతులు 1,01,116/ విరాళాన్ని సంబంధిత ఆలయ అధికారులు, అర్చకుల సమక్షంలో శనివారం అందజేసారు. అలాగే అమ్మవారికి బంగారు ముక్కుపుడక,బొట్టు,బులాకీ ఇవ్వటానికి సంకల్పించుకున్నారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు వేదాశీర్వాదాన్ని అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ సజావు అమలుపై సీఈవో ఆరా!

**- క్షేత్రస్థాయిలో పర్యటించిన వివేక్ యాదవ్-**



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఈసీఐ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడంలో సమష్టి భాగస్వామ్యం అవసరమని ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) వివేక్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం సీఈవో వివేక్ యాదవ్ విజయవాడ అర్బన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. చిట్టినగర్, కంసాలి పేట ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ 208, 217 పరిధిలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎలక్టోరల్ ఆఫీసర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి క్షేత్రస్థాయిలో సర్ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించారు. గత ఎస్ఐఆర్ ఆధారంగా ఓటర్ల మ్యాపింగ్, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వాటి స్వీకరణ, డిజిటైజేషన్ పనులను పరిశీలించారు. నియోజకవర్గం స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి. అక్కడి అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి ప్రక్రియ అమలుపై ఆరా తీశారు. ఓటర్ల సేవలో స్ఫూర్తితో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించి. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లేందుకు కీలకమైన ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో కీలక భాగస్వాములు కావాలని సీఈవో వివేక్ యాదవ్ కోరారు. పర్యటనలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) ఎ.రవీంద్రరావు, సహాయ ఈఆర్వోలు ఎన్.శ్రీనివాస్‌రావు, డి.హరీష్, జి.సృజన, చంద్రబోస్, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

## దేవస్థాన ఆస్తుల సంరక్షణే ధ్యేయం: క్షేత్రస్థాయిలో భూములు,

**సోలార్ ప్లాంట్ పనులను పరిశీలించిన ఈవో వి.కె. శీనా నాయక్**



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):–శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆస్తుల సంరక్షణ, భూముల సద్వినియోగం, విద్యుత్ స్వయం సమృద్ధి లక్ష్యంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ శనివారం మధ్యాహ్నం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి గూడవల్లి, పాతపాడు గ్రామాల్లోని దేవస్థాన భూములను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, పలు ఆదేశాలు జారీ చేశారు. 1. గూడవల్లి గ్రామంలో, చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారి కి అత్యంత సమీపంలో ఉన్న దేవస్థాన విలువైన భూములను సందర్శించారు. ఈ భూమిలో విపరీతంగా పెరిగిన ముళ్ల కంపలను, పిచ్చి మొక్కలను జంగిల్ క్లియరెన్స్ ద్వారా తక్షణమే తొలగించి, భూమిని పూర్తిగా శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. దేవస్థాన భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానానికి ఎక్కడెక్కడ, ఎంతెంత భూములు ఉన్నాయనే పూర్తి వివరాలు (ల్యాండ్ బ్యాంక్ డేటా) భక్తులకు, సాధారణ ప్రజలకు పారదర్శకంగా తెలిసేలా ఇంద్రకీలాద్రిపై ఒక పెద్ద సమాచార బోర్డును (డిస్‌ప్లే పట్టిక) ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 2. పాతపాడు గ్రామంలోని దేవస్థాన భూమిలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ కేంద్రాన్ని ఈవో సందర్శించారు. ప్లాంట్ పనితీరును, ప్రస్తుతం జరుగుతున్న రోజువారీ విద్యుత్ ఉత్పత్తి వివరాల రికార్డులను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ వారి భూముల్లో 1 మెగావాట్ (1 వీఔ) విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఈ సోలార్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ, నెలకు 1,20,000 (లక్షా 20 వేల) యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తోంది. ప్రస్తుతానికి ఇంద్రకీలాద్రి కొండపై దేవస్థాన అనుబంధ ఆలయాలు, కార్యాలయాల విద్యుత్ అవసరాల కొరకు నెలకు సుమారు 1,00,000 (లక్ష) యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని,?ఇంద్రకీలాద్రి వినియోగం పోను ప్రతి నెలా సుమారు 20,000 యూనిట్ల మిగులు విద్యుత్ లభిస్తోందని,ఈ మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించడం ద్వారా దేవస్థానానికి ఆర్థికంగా మరింత ప్రయోజనం చేకూరుతుంది. దీనికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) ద్వారా జరగవలసిన నెట్ మీటరింగ్ వ్యవస్థ పనుల పురోగతిని, సాంకేతిక అంశాలను, విద్యుత్ సంస్థ పేర్కొన్న ప్రకారం అమలు చేయవలసిన పనుల స్థితిని ఈవో అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ నెట్ మీటరింగ్ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించారు.?ఈ పర్యటనలో దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీమతి ఎల్. రమాదేవి, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీ మస్తాన్,శ్రీ సునీల్ కుమార్, ఆలయ లాండ్స్, ఇంజినీరింగ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవాడ నగర పాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ గా పి. సత్యకుమారి



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):– విజయవాడ నగరపాలక సంస్థలో ఎస్ఈ (ప్రాజెక్ట్స్)గా విధులు నిర్వహించి, చీఫ్ ఇంజినీర్‌గా పదోన్నతి పొందిన పి. సత్యకుమారి శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను ప్రధాన కార్యాలయంలో గల కమిషనర్ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ చీఫ్ ఇంజినీర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లోనూ అదే నిబద్ధత, సమర్థతతో పనిచేసి నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పి. సత్యకుమారి కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, నగరాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల అమలులో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు.

## ఏషియన్ ఓపెన్ ఐస్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌కు ఎంపికైన కైవల్యకు వియంసి కమిషనర్ ధ్యానచంద్ర అభినందనలు



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):– ఇండోనేషియాలో వచ్చే నెల 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు జరగనున్న ఏషియన్ ఓపెన్ ఐస్ స్కేటింగ్ ఛాంపియన్షిప్––2026కు అర్హత సాధించిన విజయవాడకు చెందిన యువ క్రీడాకారుడు కొప్పురపు కైవల్యను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా కైవల్య ఇటీవల సాధించిన విజయాలను కమిషనర్‌కు వివరించారు. జూన్ 25 నుండి 30వ తేదీ వరకు డెహ్రాడూన్‌లో నిర్వహించిన 21వ జాతీయ ఐస్ స్కేటింగ్ ఛాంపియన్షిప్లో ఫిగర్ స్కేటింగ్ లెవెల్––8 బాలుర విభాగంలో స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడంతో పాటు, ఆ ప్రతిభ ఆధారంగా ఏషియన్ ఓపెన్ ఐస్ స్కేటింగ్ ఛాంపియన్షిప్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కిందని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, అంతర్జాతీయ వేదికపై విజయవాడ నగరానికి, ఆంధ్రప్రదేశ్‌కు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కైవల్య భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించాలని ఆశిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. యువ క్రీడాకారులు పట్టుదల, కృషి, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని కమిషనర్ పేర్కొన్నారు.

## నూటికి నూరు శాతం పోలింగ్ జరిగేందుకు 'సర్' దోహదం. ఎమ్మెల్యే గద్దె



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):– ఎన్నికల్లో నూటికి నూరు శాతం పోలింగ్ జరిగేందుకు 'సర్' కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. శనివారం ఉదయం తూర్పు లోని 7వ డివిజన్ లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం డివిజన్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమం జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ 'సర్ ' కార్యక్రమంపై ప్రతి ఒక్కరిని చైతన్య పరచడంతో పాటుగా సర్ కార్యక్రమాన్ని సమగ్రంగా చేయడానికి బీఎల్‌వోలు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కృషి చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటే నగరాల్లో ఈ సర్ కార్యక్రమం నిర్వహించడానికి కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎప్పుడూ ఓటు వేయని వారి పేర్లను ఓటరు జాబితాను నుంచి తొలగించడానికి ఎవ్వరికీ ఇబ్బంది ఉండదన్నారు. విజయవాడ నగరంలో గుర్తు తెలియని చాలా మంది వచ్చి నివాసం ఉంటున్నారని, నగరం ఒక షెల్టర్ జోన్‌గా మారిందన్నారు. నగరంలో ఉండే ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వారికి ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఈ 'సర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సర్ కార్యక్రమం విజయవాడ నగరంలో చాలా నెమ్మదిగా జరుగుతుందన్నారు. నూటికి నూరు శాతం పోలింగ్ జరిగేలా చూసేందుకు ఈ సర్ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తోందని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వో జక్కా అనూస, పటమట సతీష్‌చంద్ర, గుమ్మడి గురుప్రసాద్, మాదల మల్లికార్జునరావు, దయాల శిరీషాగాంధీ, నాగుమోతు రాజా, పడాల గంగాధర్, పెనుగొండ శ్రీనివాస్, శివలక్ష్మి, పరసా లక్ష్మణ్, పెరవల శివ, బట్టు మధుబాబు, దాడి సుబ్బారావు, పటమట సన్నీ, ప్రేమవరపు రవి తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ స్క్రాప్ పార్క్‌లో వంగవీటి మోహనరంగా విగ్రహ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బోండా ఉమా



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):– విజయవాడ బస్టాండ్ సమీపంలోని స్క్రాప్ పార్క్‌లో ఏర్పాటు చేయనున్న స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహ స్థలానికి ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాధా–రంగా మిత్రమండలి సభ్యులు, అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వి.యం.రంగా కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, సమాజంలోని పేదలు, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన అసలైన ప్రజానాయకుడని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, కాపు సహా అన్ని వర్గాల ప్రజలను సమానంగా ఆదరిస్తూ, కులమతాలకు అతీతంగా ప్రజా సేవనే పరమావధిగా భావించి తన జీవితాన్ని అంకితం చేసిన మహానేతగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని ఉమా పేర్కొన్నారు. 1980వ దశకంలో విజయవాడ నగరంలో రౌడీయిజం, భయానక పరిస్థితులు నెలకొన్న సమయంలో సామాన్య ప్రజలు, మహిళలు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో అన్యాయానికి ఎదురొడ్డి నిలబడి, పేదల పక్షాన పోరాడిన ధైర్యవంతుడు వంగవీటి మోహనరంగా అని అన్నారు. ఎవరిపై అన్యాయం జరిగినా, ఏ బలహీన వర్గానికి చెందిన వ్యక్తి కష్టాల్లో ఉన్నా ఆయన వెంటనే స్పందించి వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేసేవారని ఉమా కొనియాడారు. మహిళలపై అఘాయిత్యాలు, పేదలపై దౌర్జన్యాలు, బలహీన వర్గాలపై దాడులు జరిగిన ప్రతిసారీ రంగా నిర్భయంగా ప్రజల తరఫున నిలబడి పోరాటం చేశారని తెలిపారు. ఎంతటి అధికార వ్యవస్థ ఎదురైనా వెనక్కి తగ్గకుండా నిరాహార దీక్షలు, ప్రజా ఉద్యమాల ద్వారా ప్రభుత్వాలను సైతం స్పందింపజేసిన అరుదైన నాయకుడు రంగా అని అన్నారు. బాధితులకు న్యాయం చేయడమే తన రాజకీయ జీవిత లక్ష్యంగా ఆయన పనిచేశారని పేర్కొన్నారు. ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానేతగా వంగవీటి మోహనరంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన మరణించి ఎన్నో సంవత్సరాలు గడిచినా ప్రజల గుండెల్లో ఆయన స్థానం ఏమాత్రం చెక్కుచెదరలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అభిమానులు ఆయన విగ్రహాలను ఏర్పాటు చేసి, జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం ఆయనపై ప్రజలకు ఉన్న అపారమైన ప్రేమ, గౌరవానికి నిదర్శనమని ఉమా తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ బస్టాండ్ సమీపంలోని స్క్రాప్ పార్క్‌లో రంగా నిరాహార దీక్ష చేసిన భంగిమలో దేశంలోనే ప్రత్యేకంగా తీర్చిదిద్దనున్న విగ్రహానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ విగ్రహ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి, రాబోయే డిసెంబర్ 26న వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా వేలాది మంది అభిమానుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరిస్తామని వెల్లడించారు. వంగవీటి మోహనరంగా ఆశయాలు, సిద్ధాంతాలు, ప్రజాసేవా భావనను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బొండా ఉమా పేర్కొన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలు, మహిళలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, రంగా చూపిన సేవా మార్గంలోనే ముందుకు సాగుతామని, ఆయన ఆశయ సాధనకు తమ జీవితాంతం కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మా మిత్రమండలి అధ్యక్షులు చింతల రామారావు బాబీ, చింతల రవికుమార్ ( చంటి ) రాష్ట్ర ఆధారంగా మిత్రమండలి అధ్యక్షులు చెన్నుపాటి శ్రీనివాస్, నవనీతం సాంబశివరావు, అడబాల కృష్ణ జి, లక వెంగలరవు, దర్శి వాసు, చందు జనార్దన్, రాజనాల బాబ్జి, యలకల చలపతి, వేల్పూరి శ్రీనివాస్ రావు, బుల్లా విజయ్ కుమార్, నరసంహా రావు తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ లో ఘనంగా వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు

**బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక వంగవీటి మోహనరంగా...**

**ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):–విజయవాడ సెంట్రల్ లోని పలు డివిజన్లలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి, ఈ సందర్భంగా సెంట్రల్ లోని 21 డివిజన్లలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాల వద్ద, కూడళ్లలో జరిగిన జయంతి కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని ఆ మహానేతకు పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాల పంపిణీ, పేదలకు పండ్ల పంపిణీ, కేక్ కటింగ్ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో కలిసి జయంతి వేడుకలను నిర్వహించారు. వి.యం.రంగా సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను భావితరాలకు చాటిచెప్పాల్సిన అవసరం ఉందని ఉమా అన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ప్రజానాయకుడని కొనియాడారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి పేదవాడి కష్టాన్ని తన కష్టంగా భావించి ప్రజల కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తిత్వం రంగా అని అన్నారు. విజయవాడ నగరంలో భయానక పరిస్థితులు నెలకొన్న సమయంలో మహిళలు, చిన్న వ్యాపారులు, కార్మికులు, బలహీన వర్గాల ప్రజలకు ధైర్యం చెప్పి అండగా నిలిచిన నాయకుడు వంగవీటి మోహనరంగా అని ఉమా పేర్కొన్నారు. అన్యాయానికి, అక్రమాలకు వ్యతిరేకంగా రాజీపడకుండా పోరాడి ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. రంగా ఆశయాలు నేటికీ లక్షలాది మంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని, ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే వి.యం.రంగా లక్ష్యమని, అదే స్ఫూర్తితో ప్రజాసేవను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వంగవీటి మోహనరంగా సేవలను భావితరాలకు చాటిచెప్పడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో న్యాయం, సమానత్వం, సేవా భావాన్ని మరింత బలోపేతం చేయాలని బొండా ఉమా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, కాపు ఫెడరేషన్ అధ్యక్షులు ఆళ్ళ తారక రామారావు, రాధా–రంగా మిత్రమండలి సభ్యులు, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొమ్మదేవర రత్నకుమారి, అభిమానులు, మహిళలు, యువకులు, చిన్నారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళులర్పించిన రామసేన అధ్యక్షుడు 'కంబాల శ్రీనివాసరావు'...!!

**– సీఎండీ లేఅవుట్‌లో ఘనంగా అల్లూరి జయంతి వేడుకలు.**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);గోకవరం గ్రామం తంటికొండ రోడ్డులోని సీఎండీ లేఅవుట్ వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కంబాల శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని అన్నారు. ఆయన చూపిన దేశభక్తి, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, కరిబండి వెంకటేశ్వరరావు, నాగ రమేష్, శ్రీమతి వీరాంజలి, బత్తిన వీరాంజనేయులు, తాటికొండ సురేష్, కేబుల్ రాజు, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఆదం మణికంఠ, పదిలం చక్రరావు, రెడ్నం వీర రాఘవ, వేగి సాంబ శివరావు, బొల్లం జానకి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, రామసేన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

## క్షత్రియ యువత సంఘం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు

**దేశభక్తి, ధైర్యసాహసాలకు ప్రతీక అల్లూరి సీతారామరాజు. బొండా ఉమా**



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):– 30వ డివిజన్ రామకృష్ణాపురంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద క్షత్రియ యువత సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరై అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు, ఆయన చూపిన ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారి సేవలను చిరస్మరణీయంగా నిలుపుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని ఉమా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, కాకర్లపూడి బ్రహ్మరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ డి.జె.పి.ఎన్. రాజు, కల్లేపల్లి సాయిరామరాజు, డివిజన్ పార్టీ అధ్యక్షులు లక్కంరాజు శ్రీనివాసరాజు, డివిజన్ ఇంచార్జ్ వెంకటరమణ, భద్రం, గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొమ్మదేవర రత్నకుమారి, రమేశ్ వర్మ, సుధీర్ వర్మ, క్షత్రియ యువత సంఘం ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 'జనసేన అప్లికేషన్లు పర్వం అత్యంత విజయవంతం...!

**– ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు –**

**ఎమ్మెల్యే 'బత్తుల' – రేపటితో ముగియనున్న కార్యక్రమం...**



రాజమహేంద్రవరం, కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వినూత్న ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన జనసేన పార్టీ సాధకుల సమాచార సేకరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది..బలమైన సంస్థాగత నిర్మాణమే జనసేన పార్టీకి బలమైన పునాది. ఏలూరు పార్లమెంట్ లో జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఉదయం నుండి పార్లమెంట్ పరిశీలకులు, రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ నేతృత్వంలోని 28 మంది సభ్యుల బృందం ఏలూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకుల నుండి దరఖాస్తుల స్వీకరణ అత్యంత ఉత్సాహంగా జరుగుతుంది. పార్టీ కమిటీల్లో బాధ్యతలు తీసుకుని పార్టీ కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న నాయకులు, జనసైనికుల నుండి దరఖాస్తులు సేకరించి, పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి వీటిని తీసుకెళ్లనున్నట్లు బత్తుల బలరామకృష్ణ తెలిపారు..

## మొక్కజొన్న పంట పై మందడపు అధ్యయనం

**– అమెరికా దేశంలోని మొక్కజొన్న క్షేత్రాల్లో పర్యటించిన మందడపు సుధాకర్**

**అగ్రరాజ్యం అమెరికా కు కాసుల పంట గా మారిన మొక్క జొన్న**

**-- 9.4 కోట్ల ఎకరాల్లో మొక్క జొన్న సాగు**

**– అమెరికా ఏకానమీలో 86 బిలియన్ డాలర్లు మొక్క జొన్ పంట విలువ**



ఖమ్మం, నేటి శుభోదయ ::: అగ్రరాజ్యం అమెరికా కు కాసుల పంట గా మారింది మొక్కజొన్న. ఎంతలా అంటే మనం ఔరా అనేలా అమెరికా ఎకానమీ లో 86 బిలియన్ డాలర్లు మన కరెన్సీలో చెప్పాలంటే ,8 లక్షల కోట్లుఅమెరికా జీడీపీ లో ఇథనాల్ వాటా 43 బిలియన్ డాలర్లు ఉంటే టాక్స్ రూపంలో 10 బిలియన్ డాలర్లు ఆదాయంతో అమెరికా కు కాసుల వర్షం కురిపించే పంటగా మారింది మొక్క జొన్న సాగు. మొక్క జొన్న చరిత్ర చూస్తే మొక్క జొన్న పంట పుట్టినిల్లు సెంట్రల్ మెక్సికో 9 వేల సంవత్సరాల క్రితం మొక్క జొన్న సాగు చేసినట్టు ఆధారాలు ఉన్నాయి. మన దేశంలో మొక్క జొన్న 16 వ శతాబ్దం లో పోర్చుగీసు వారి వల్ల ఇక్కడ కు వచ్చినట్టు ఆధారాలు ఉన్నాయి. అమెరికాలో మొక్క జొన్న సాగు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కు కీలకంగా మారింది. అమెరికాలో మొక్క జొన్న 9 కోట్ల ఎకరాల్లో సాగు చేస్తోన్నారు. ఎక్కువగా అయివా ఇల్లినాయిస్. నెబ్రాస్కా, మిన్నెసోటా, ఇండియానా, కన్సాస్. సౌత్ డకోటా, ఒహియో, మిసౌరి, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో మొక్క జొన్న సాగు ఎక్కువగా ఉంటోంది. ఓ ఏడాదిలో మొక్క జొన్న పంట విలువ చూస్తే మన కరెన్సీలో 8 లక్షల కోట్లు. అమెరికాలో మొక్క జొన్న నుంచి తయారు చేసే ఇథనాల్ వల్ల అక్కడ జీడీపీ లో 43 బిలియన్ డాలర్లు ట్యాక్స్ రూపంలో 10 బిలియన్ డాలర్లు ఆదాయం. అమెరికా లో మొక్క జొన్న ను కార్న్ గా పిలుస్తారు. ఫీల్డ్ కార్న్‌స్వీట్ కార్న్, పాఫ్ కార్న్ రకాలు ఉంటాయి. మొక్క జొన్న నుంచి పలు రకాల ఉత్పత్తులు తయారు చేస్తారు. కార్న్ ఆయిల్ కార్న్ ఫ్లోర్ కార్న్ కలర్స్ తయారు చేస్తారు. ముఖ్యంగా ఇథనాల్ తయారీ వల్ల మొక్క జొన్న సాగు కు బాగా విలువ ఉండటం తో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థ కు ఇందనం గా మారింది మొక్క జొన్న సాగు.– తక్కువ ఎరువులు వినియోగండీ. ఏ. పీ, యూరియా,పొటాష్ డ్రోన్ల ద్వారా పిచికారి,లిక్విడ్ రూపంలో ఎరువులు భూమిలో వేయకుండా పై నుంచి పిచికారి వల్ల భూమి కాలుష్యం అవ్వకుండా అమెరికా రైతులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సాగు చేస్తున్నారు.

## "రంగా ఆశయాలు సాధిద్దాం:బొలిశెట్టి రాజేష్"



తాడేపల్లిగూడెం జులై 4 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::: పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత వంగవీటి మోహనరంగా ఆశయాల సాధనకు కృషి చేయాలని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ అన్నారు. రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక గొల్లగూడెం సెంటర్లో శనివారం వంగవీటి మోహన రంగా జయంతి నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు పొందిన నాయకుడు రంగా ను ఆదర్శంగా తీసుకొని ప్రజా సేవకు పాటుపడాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వర్తనపల్లి కాశి, యాదాల శివాజీ, అత్తిలి బాబి, పడాల శ్రీనివాస్, అంగిన దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## "కూటమి ధర్మం పాటించండి వలవల బాబ్జికి బిజెపి,టిడిపి నేతల సూచన"



తాడేపల్లిగూడెం, జులై 4 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::ప్రభుత్వ కార్యక్రమాలే కాకుండా, తన సొంత నిధులను కూడా వెచ్చించి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ను గౌరవించాలని టిడిపి, బిజెపి పార్టీల నాయకులు టిడిపి ఇంచార్జి వలవల బాబ్జి కి సూచించారు. స్థానిక గొల్లగూడెం కూడలి వద్ద సెలక్షన్ గ్రాండ్ హోటల్ లో శనివారం బిజెపి,టిడిపి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేతలు మాట్లాడుతూ ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు మాత్రమే ప్రజలు అధికారం ఇస్తారని, మిగతా నాయకులు ప్రజాతీర్పును గౌరవించాలని అన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రాష్ట్రంలోనే ఉత్తమ పనితీరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ప్రశంసలు పొందారని, స్థానికంగా కూటమి నాయకులు ఆ గౌరవాన్ని కాపాడుకోవాలని అన్నారు. తాను కూటమి ఎమ్మెల్యే గా వ్యవహరిస్తానని, కూటమిలో మూడు పార్టీలకు చెందిన వారందరూ తనకు సమానమేనని అనేక సందర్భాల్లో ఎమ్మెల్యే తెలియజేశారని అన్నారు. బొలిశెట్టి పై వ్యక్తిగత అసూయతో కూటమిని బలహీనపరచవద్దని కోరారు. తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి కి ముందు,తర్వాత అనే స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని, కూటమి నాయకుడే అభివృద్ధిని అడ్డుకునే విధంగా ప్రవర్తించడం తగదని అన్నారు. వ్యక్తిగత సమస్యలు ఉంటే అంతర్గత సమావేశాలలో పరిష్కరించుకోవాలని, అలా కాకుండా మీడియాలో తప్పుడు ప్రచారం చేయించటం సమంజసం కాదన్నారు. తనకు గిట్టని వారిపై ఒకరిద్దరు మీడియా వారిని పిలిచి తప్పుడు రాతలు రాయించడం మానుకోవాలని కోరారు.ఇప్పటికయినా బాబ్జి తన వైఖరి మార్చుకొని , కూటమి ధర్మాన్ని పాటించాలని నాయకులు కోరారు.రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు భారీగా జరుగుతున్నాయని, సమర్థవంతమైన కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు.ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ బిజెపి ఇంచార్జి ఈతకోట తాతాజీ, బిజెపి జిల్లా నాయకుడు నరిసే సోమేశ్వరరావు, టిడిపి జిల్లా నాయకుడు వాడపల్లి సుబ్బరాజు, టిడిపి నాయకులు బేతిన గిరి, వట్టికూటి అబ్బు, పసల కొండ, పసుమర్తి లక్ష్మణ్,పిల్లా రాంబాబు,వీర్ల కృష్ణ, మద్దీపాటి రవితేజ, శనగన రాంబాబు,రామగాని సత్యనారాయణ, మద్దీపాటి ధర్మేంద్ర, ఎరుబండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## "మున్సిపల్ కమిషనర్ యేసుబాబు స్పెషల్ గ్రేడ్ కమిషనర్ గా పదోన్నతి"



తాడేపల్లిగూడెం జులై 4 "అవినాష్ మారంపూడి నేటి శుభోదయ):::తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ యేసుబాబు గ్రేడ్-1 నుండి స్పెషల్ గ్రేడ్ కమిషనర్ గా పదోన్నతి పొందారు. అదే స్థానంలో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో కొనసాగనున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది, అధికారులు ఆయనను ఘనంగా అభినందించారు.

## పశ్చిమలో ఘనంగా వంగవీటి మోహన రంగా79వ జయంతి కార్యక్రమం

**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా.మాజీ మంత్రి వెలంపల్లి**



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):- స్వర్గీయ వంగవీటి మోహన రంగా 79వ జయంతి సందర్భంగా పశ్చిమలోని చెరువు సెంటర్ వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద పశ్చిమ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ, కాపు టీమ్ , వి.యం.రంగా అభిమానుల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైఎస్సార్సీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు అనంతరం కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేసారు . ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ సమాజంలోని బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడి, వారి హక్కుల కోసం పోరాడిన నిజమైన ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహన రంగా అని వెలంపల్లి కొనియాడారు. రంగా ప్రజా ఉద్యమాల్లో నిరంతరం శ్రమిస్తూ, చివరికి ప్రజా సంక్షేమం కోసమే తన ప్రాణాలను సైతం అర్పించారని గుర్తుచేశారు. ఇంతటి మహోన్నతమైన త్యాగం చేసిన వ్యక్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకే ప్రతి సంవత్సరం రాజకీయాలకతీతంగా రంగా అభిమానులు, వైఎస్సార్సీపీ శ్రేణులు కలిసి ఇక్కడ ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.చిన్న వయసులోనే అప్పటి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రోడ్డుపై కూర్చుని దీక్ష చేస్తున్న వంగవీటి రంగా ను, నాటి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే అత్యంత నిర్మొహమాటంగా, క్రూరంగా హతమార్చడం జరిగిందని వెలంపల్లి ఆరోపించారు. ఈ చారిత్రక ఘోరాన్ని ఈరోజుకూ ప్రజలెవరూ మర్చిపోలేరని ఆయన స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ముందుండే వి.ఎం. రంగా ఆలోచనా విధానాన్ని, ఆశయాలను మనమందరం ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని పిలుపునిచ్చారు.స్వర్గీయ వైఎస్ రాజశేఖర రెడ్డికి, వంగవీటి రంగాతో ఎంతో అనుబంధం ఉండేదని, అదేవిధంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి కూడా వి.యం.రంగా అంటే అపారమైన గౌరవం, అభిమానం ఉన్నాయని వెల్లంపల్లి పేర్కొన్నారు. రంగా ఆశయాల సాధన కోసం గతంలో రాజశేఖర రెడ్డి, ఆ తర్వాత జగన్ మోహన్ రెడ్డి ఇద్దరూ కూడా ఎంతో కృషి చేశారని, వారి ఆశయాలను నిరంతరం కొనసాగించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. విజయవాడతో పాటు పరిసర ప్రాంతాల్లోని అన్ని కులాల వారు, అన్ని మతాల వారు రంగా ను గుండెల్లో పెట్టుకుని అభిమానిస్తారని, వి.యం.రంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగుతాయని వెలంపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అనుక్షణం రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు శ్రమిస్తున్న అభిమానులందరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని, రంగా ఆశయ సాధన కోసం తమ పార్టీ నిరంతరం పనిచేస్తుందని వెలంపల్లి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రంగా అభిమానులు, తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహమే వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది. బొండా రవితేజ



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):- అజిత్‌సింగ్ నగర్‌లోని పీఎం శ్రీ ఎం.కే. బేగ్ మునిసిపల్ హైస్కూల్‌లో 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి విద్యార్థుల ఉత్తమ ప్రతిభను గుర్తిస్తూ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు కుమారుడు బోండా రవితేజ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులను నగదు బహుమతులు, బ్యాగులు, గిఫ్ట్‌లతో ఘనంగా సత్కరించారు.పదవ తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన షేక్ రాహేలా (581/600)కు 10,000 నగదు బహుమతితో పాటు ప్రత్యేక బహుమతిని అందజేశారు. ద్వితీయ స్థానం సాధించిన తోటకుచ్చి హారిక (563/600), తృతీయ స్థానం సాధించిన తరుణ్ భాష్య (554/600)లకు 5,000 చొప్పున నగదు బహుమతులు అందజేయగా, మిగిలిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు.ఈ సందర్భంగా బోండా రవితేజ మాట్లాడుతూ విద్యే జీవితాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే గొప్ప ఆయుధమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే దేశ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారి ఉన్నత విద్యకు అండగా నిలుస్తామని రవితేజ హామీ ఇచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైనం హుస్సేన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఇదే స్ఫూర్తితో రానున్న సంవత్సరాల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బంగారు నాయుడు, పార్లమెంట్ స్థాయి కార్యదర్శి పర్వీన్, గౌసియా, నవీన్, మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యాడికిలో 'సర్' ప్రోగ్రాంను వేగవంతం చేయాలి

**ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక సమావేశం**



యాడికి జూలై 04 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలో 'సర్' కార్యక్రమంపై బూత్ స్థాయి ఏజెంట్లతో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో 'సర్' కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని బూత్ స్థాయి ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలన జరపాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల వారీగా మరణించిన వారి ఓట్లను గుర్తించి తక్షణమే జాబితా నుండి తొలగించాలని, అదేవిధంగా అర్హులైన కొత్త ఓటర్లందరినీ గుర్తించి వారి పేర్లను ఓటరు లిస్టులో చేర్పించాలని కోరారు. ప్రతి బూత్ పరిధిలో ఏజెంట్లు బాధ్యతాయుతంగా పనిచేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చూస్తూ ఈ 'సర్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ ముఖ్యమైన కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆదినారాయణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రుద్రమ నాయుడు, క్లస్టర్-4 ఇంచార్జ్ మాయకుంట నారాయణస్వామి, అలాగే బూత్ స్థాయి ఏజెంట్లు నరసింహ చౌధరి, దయ్యాల మడుగు సుబ్బారెడ్డి, హాజీ పీర, రామచంద్ర రాజు, నారాయణరెడ్డి, ఆదినారాయణ, వంకం రాజు, దివి చంద్ర, ఖాదర్ వలీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

**45 మంది లబ్ధిదారులకు రూ.28 లక్షల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్**



పెనమలూరు, జులై 4 ( అజయ్ నారగాని ) పేద ప్రజలకు అత్యవసర వైద్య చికిత్సల కోసం లక్షల రూపాయల భారం పడకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శనివారం పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 45మంది లబ్దిదారులకు 28లక్షల విలువైన చెక్కులను పంపిణి చేసిన అనంతరం మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్య భీమా,వైద్య సేవలపై అవగాహన పెరగాలని సూచించారు.గత రెండు సంవత్సరాల్లోనే పెనమలూరు నియోజకవర్గంలో దాదాపు రూ.20.14 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేసి రాష్ట్రంలోనే తొలి 4--5 స్థానాల్లో నిలిచామని తెలిపారు.నియోజకవర్గంలోని పోరంకి,కానూరు, తాడిగడప,యనమలకుదురు,చోడవరం, వనుకూరు తదితర గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీలు,మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేశామని, యనమలకుదురు ప్రాంతంలో కృష్ణా నది కాలువ కట్టల నిర్మాణ పనులు కూడా చేపట్టామని పేర్కొన్నారు.ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ సంక్షేమ పథకాలను నిరంతరంగా అమలు చేస్తున్నామని తెలిపారు. 'తల్లికి వందనం', 'ఉచిత బస్సు ప్రయాణం 'ఉచిత గ్యాస్ సిలిండర్లు', 'అన్నదాత సుఖీభవ' వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ నాయకత్వంతో రాష్ట్రానికి సుమారు రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, రాబోయే ఐదారు సంవత్సరాల్లో పరిశ్రమలు పూర్తిస్థాయిలో ప్రారంభమై స్థానిక యువతకు గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు లభించేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు.సహాయం కోసం వచ్చే ప్రజల కులం,మతం, రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా అర్హత ఆధారంగానే సహాయం అందిస్తున్నామని,దీనిని తట్టుకోలేక కొందరు వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలకు దిగుతున్నారని మండిపడ్డారు,గత



ప్రభుత్వంలో అక్రమ కేసులతో వేధింపులకు గురైనప్పటికీ,ప్రస్తుతం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అంకితమైన కూటమి ప్రభుత్వాన్ని,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మరోసారి ఆశీర్వదించాలని, ఈ మంచి పాలన గురించి కనీసం మరో పది మందికి తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు,లబ్ధిదారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజుని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి




గుడివాడ, జులై 4 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) బ్రిటీషు ప్రభుత్వాన్ని గడగడ లాడించి బానిసత్వం నుంచి విముక్తి కలిగించిన అల్లూరి సీతారామారాజుని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని గుడివాడ క్షత్రియ సేవాసమితి, అల్లూరి సీతారామరాజు స్మారక కమిటీ సభ్యులు అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గుడివాడ క్షత్రియ సేవాసమితి, అల్లూరి సీతారామరాజు స్మారక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. మన్యం ప్రజలకు అండగా ఉండి వారి కష్టాల నుంచి విముక్తులుని చేసి అమరుడయ్యాడని అన్నారు. అటువంటి మహా వ్యక్తి జయంతిని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సుమారు వెయ్యికి పైగా ఆహార పొట్లాలను పాదచారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు కోసూరి రవిరాజు, స్మారక కమిటీ గౌరవ సలహాదారు గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ లంక దాసరి ప్రసాదరావు, సంఘ ఉపాధ్యక్షులు సాగిరాజు ఉదయభాస్కరరాజు, రుద్రరాజు విజయ్ కుమార్ రాజు, నాగవర్ధన రాజు, సాగిరాజు గజపతిరాజు, నందూరి ఉమాశంకర్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## పశ్చిమలో ఘనంగా అల్లూరి సీతారామరాజు 129వ జయంతి కార్యక్రమం.పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి



విజయవాడ, జూలై 3(నేటి శుభోదయ):-వించిపేటలోని ఇస్మాయిల్ వీధిలో శనివారం వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలరాజు రమేష్ రాజు ఆధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి సీత రామరాజు 129వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు.ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరల గుండెల్లో నిద్రపోయిన విప్లవ జ్యోతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కేవలం 27 సంవత్సరాల చిన్న వయసులోనే దేశ స్వేచ్ఛ కోసం, పరాయి పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం అద్వితీయం, చిరస్మరణీయమని పేర్కొన్నారు. సాయుధ పోరాటం ద్వారానే బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించవచ్చని నిరూపించిన మహోన్నత దేశభక్తుడు అల్లూరి అని వెలంపల్లి శ్లాఘించారు.గిరిజనుల హక్కులను కాలరాస్తున్న అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ చట్టాలపై అల్లూరి గర్జించారని వెలంపల్లి గుర్తుచేశారు. మన్యం ప్రజలను ఏకం చేసి, వారిలో స్వదేశీ చైతన్యాన్ని రగిల్చి, చారిత్రాత్మక 'రంప విప్లవానికి' ఆయన నాయకత్వం వహించారన్నారు. సాంప్రదాయ విల్లంబులు, కొద్దిపాటి ఆయుధాలతోనే వ్యూహాత్మక గెరిల్లా పోరాటాన్ని నడిపి, బ్రిటీష్ పోలీస్ స్టేషన్లపై దాడి చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న ఆయన యుద్ధ తంత్రం చరిత్రలో నిలిచిపోతుందని స్పష్టం చేశారు.స్వార్థం లేని త్యాగానికి, అచంచలమైన ధైర్యానికి అల్లూరి సీతారామరాజు నిలువెత్తు రూపమని వెలంపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. మాతృభూమి విముక్తి కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ఆయన అమరత్వం ప్రతి భారతీయుడి గుండెల్లో అగ్రేసరమై వెలుగుతోందని, నేటి తరం యువతకు ఆయన దేశభక్తి, పోరాట పటిమ ఎప్పటికీ ఆదర్శమని అన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అసిఫ్, మాజీ కార్పొరేటర్లు, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 2029 లో నేనే రాప్తాడు లో ఎమ్మెల్యే అమలు అయ్యేది తోపుదుర్తి రాజ్యాంగమే

**2029లో జగనన్న సీఎం అయ్యేదాకా ఎన్ని త్యాగాలైనా చేస్తాం. ఎమ్మెల్యే అయిన మూడు నెలలకు 7 కోట్ల విలువ చేసే విల్లా ఎలా కొన్నావు ఎంఎస్ రాజు నువ్వు మామూలోడివి కాదు. హైబ్రీడ్ రాజువు.గుండుమల తిప్పేస్వామికి గుండు కొట్టించి పక్కన కూర్చోబెట్టాడు లోకేష్..జనంలో నుంచి పుట్టాం. జనంలోనే ఉంటాం. జనం కోసం చస్తాం. నాలాంటోడు టికెట్ కోసం యాచించడు..పరిటాల శ్రీరామ్ నాకెందుకు గన్‌మెన్లు. పరిటాల సునీతమ్మ చనిపోయిన భర్త గురించి ఏళ్ల తరబడి చెప్పుకుంటూ రాజకీయం చేస్తోంది.సురేంద్రబాబు నీ చరిత్ర ఏంది. ఏ ఊరు నీది. కేరాఫ్ ప్లాట్‌ఫాం వ్యక్తివి రాచానపల్లిలో సిమెంట్ బ్రిక్స్ ప్లాట్‌ఫాం వేసుకొన్న నువ్వు ఈరోజు 1000 కోట్ల ఆస్తి ఎలా వచ్చిందిలోకేష్...నువ్వు తప్పుడువారితో సావాసాలు చేస్తున్నావు.ఇప్పుడు నీ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది.ఇప్పుడు ఎన్నికలు జరిగినా జగన్ 150 సీట్లతో గెలుస్తాడని పరిటాల సునీతమ్మ చెప్పిందట 2029లో ఎక్కడుంటారో ఏమో జాగ్రత్తపడు లోకేషా..!**

నంత పురం బ్యూరో జూలై 04 నేటి శుభోదయ:'2029లో జగనన్న సీఎం అయ్యేదాకా ఎన్ని త్యాగాలైనా చేస్తాం. ఆ తర్వాత జగనన్న మాటకూడా వినం. 2029 తర్వాత ఇక్కడ అమలయ్యేది తోపుదుర్తి రాజ్యాంగమే ఖబడ్దార్' అంటూ రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హెచ్చరించారు. అనంతపురం నగరంలోని వైసిపి కార్యాలయంలో వైసీపీ నేత రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నిన్నటి రోజున ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ చేసిన వ్యాఖ్యలపై రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి ఘాటుగా స్పందించారు.తాడిపత్రి వైపు నంచి వస్తున్న సమయంలో జరిగిన ఘటన, ఏ నేపథ్యంలో వరుస ఘటనలు జరుగుతున్నాయనేది నేను విశదీకరించా. మే14న మంత్రి నారా లోకేష్ జిల్లాకు వచ్చినప్పటి నుంచి నిన్నటి రోజు (జూలై 3) వరకు జరిగిన ఘటన గురించి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చెప్పుకొచ్చారు.బాబూ రాజు...చెప్పుల షాపులో పని చేసేటప్పటి నుంచి ఈరోజు లోకేష్‌కు బినామీ వరకు ఎదిగిన వైనం అందరికీ తెలుసు. భూస్వాముల ఇళ్లల్లో పెట్టి కోట్లాది రూపాయల కాంట్రాక్ట్ పనులు చేసిన మేము ఇప్పటికీ బాడుగ ఇళ్లల్లో ఉన్నామని చెబుతుంటే ఎవరూ నమ్మడం లేదు. కనీసం నువ్వైనా నమ్మావు రాజు థ్యాంక్స్. తాను ఉంటున్న ఇంటికి పదేపదే బాడుగ కట్టలేదని చెప్పావు. ఎమ్మెల్యే అయిన మూడు నెలలకు సాక్షి ఆఫీసు పక్కన 7 కోట్ల విలువ చేసే విల్లా ఎలా కొన్నావు ఎంఎస్ రాజు?. నీ పార్టీ కార్యాలయ భవనం కూడా కొన్నావంట కదా?, బెంగళూరులోనూ ఏదో ప్రాపర్టీ కొన్నావంట కదా బాబు రాజు. నువ్వు మామూలోడివి కాదు. హైబ్రీడ్ రాజువు. అందుకే నాలుగు పదవులు. టీటీడీ బోర్డు మెంబరు, ఎమ్మెల్యే, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు. గుండుమల తిప్పేస్వామికి గుండు కొట్టించి పక్కన కూర్చోబెట్టాడు లోకేష్. జనంలో నుంచి పుట్టాం. జనంలోనే ఉంటాం. జనం కోసం చస్తాం. నాలాంటోడు టికెట్ కోసం యాచించడు. కాంట్రాక్ట్ పనులు చేసేవారు టికెట్ల కోసం యాచించాలి. నా నియోజకవర్గంలో ఏ సందులోకి వెళ్లినా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గురించి చెబుతారు. నువ్వేంట్రా బాబూ పరిటాల శ్రీరామ్...ధర్మవరంలో ఉన్నావు. నీపనేంటో చేసుకుంటున్నావు. అగర బత్తుల గురించి మాట్లాడుతున్నావు. చమన్‌సాబ్ అనుకుంటివా అగర్‌వత్తులు పెట్టేదానికి. నాకెందుకురా గన్‌మెన్లు. బుల్లెట్లు ఎన్ని వాడారో గన్‌మెన్లు ప్రభుత్వానికి లెక్క చెప్పాలి నేను లెక్కలు చెప్పాల్సిన అవసరం లేదు. మరి నాకెందుకు గన్‌మెన్లు. సునీతమ్మ చనిపోయిన భర్త గురించి ఏళ్ల తరబడి చెప్పుకుంటూ రాజకీయం చేస్తోంది. పరిటాల రవి పేరు చెప్పుకోంది ఆమెకు పూట గడవదు. సునీతమ్మా...నీ భర్త నీకలలోకి రావాలి కాని నాకలలోకి ఎందుకు వస్తాడు. ఆయన్ను మరిచిపోయావా? కలలోకి కూడా రానంతగా మరిచిపోయావా?. పిచ్చికుక్క గురించి మాట్లాడతారా? పిచ్చికుక్కలు కనిపిస్తే వాటిని మునిసిపాలిటీ వారు చంపి పూడ్చుతుంటారు. పూడ్చిన ప్రతి పిచ్చికుక్క కలలోకి వస్తుందా? నీ కుక్కపిల్లను ధర్మవరంలో కట్టేశావు. నీ ఇంట్లో కట్టేసుకో. ఎందుకంటే మునిసిపల్ వ్యాన్లు ఈ మధ్య కాలంలో ధర్మవరంలోనూ తిరుగుతున్నాయి.సురేంద్రబాబు నీ చరిత్ర ఏంది. ఏఊరు నీది. కేరాఫ్ ప్లాట్‌ఫాం గాడివి నువ్వు. రాచానపల్లిలో సిమెంట్ బ్రిక్స్ ప్లాట్‌ఫాం వేసుకొనింటివి. అక్కడి నుంచి ఈరోజు 1000 కోట్ల ఆస్తిపరుడి దాకా ఎదిగావు. వందల కోట్ల ఆస్తులు, వేల కోట్ల బ్యాంక్ బ్యాలెన్సులు ఎక్కడి నుంచి వచ్చాయి. నువ్వు కూడా మాట్లాడుతున్నావు.నియోజకవర్గంలో ఒక్క రూపాయి నాకు ఆదాయం వద్దు అని చెప్పి ఓట్లు వేయించుకున్నావు. ఈరోజు 356 బెల్ట్‌షాపులు పెట్టి ఒక క్వాటరు మీద 50 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నావు. వందల కోట్లు కొల్లగొడుతున్నావు. మా ఎంపీలు కేంద్రం నుంచి తెచ్చిన వర్కులను చేసిన నువ్వు సంపాదించుకుని అదే ఎంపీ రంగయ్యపై నిలబడి వందకోట్లు ఖర్చు చేసి గెలిచావు. 2014లో మీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 90 కోట్ల హంద్రీనీవా పనులను చేజిక్కించుకుని సుమారు 200 కోట్లు బిల్లులు చేసుకుంటివి. నష్టంలో పనులు తీసుకున్న త్యాగమూర్తివి అయితే 90 కోట్ల పనులకు 200 కోట్ల బిల్లులు ఎట్ల చేసుకుంటివప్పా? జగన్‌మోహన్‌రెడ్డి నిన్ను గేటుకూడా దాటినవ్వలేదు. నువ్వు ప్రకాష్ రెడ్డి పనులు కొట్టేశావు. నువ్వు రావద్దని చెప్పాడు. ఎన్నికల ముందు మావాళ్లు కొందరికి చందాలిచ్చి వారిద్వారా అన్ని ప్రయత్నాలు చేశావు. ఏదీ కుదరకపోతే నావద్దకు వచ్చావు. ఇది నీబతుకు. 36వ ప్యాకేజీ పనులు ఆరోజు 40 కోట్లు మిగులు పనికి ఈరోజు 440 కోట్లకు టెండరు పిలిపించుని పనులు తీసుకున్నావు. ఇదికాకుండా మడకశిర బ్రాంచ్ కెనాల్ పనులు కూడా తీసుకున్నావు. వెడల్పు, కాలువ నిర్మాణానికి నాలుగురెట్ల అంచనాలు వేసుకున్నారు. 70 రూపాయల మట్టి పనికి 370 రూపాయలు పెట్టుకున్నారు. ఈ పనుల్లో లోకేష్‌కు ఎంత ఇస్తున్నావు? ఎమ్మెల్యేలకు ఎంత ఇస్తున్నావు? బాగా తిని బలుచు సురేంద్రా అని నిన్ను మేపుతున్నారు. 2029 ఎన్నికల్లో వారలు కోసి ఉడికించి కార్యకర్తలకు పంచుతాం. రాప్తాడు, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని టీడీపీ కార్యకర్తలకు మీరు బ్రాంది షాపులు డబ్బులు ఇవ్వకపోతే మేమే న్యాయం చేస్తాం. అర్థమైందా రాజా... లోకేష్...నువ్వు తప్పుడువారితో సావాసాలు చేస్తున్నావు. మీ నాయన కాలంలో ధర్మవరం, పెనుకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లోని మండలాలు నియోజకవర్గంగా ఉన్న సమయంలో వంద మందిని హత్యలు చేశారు. మీనాయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చాలా కేసులు విచారణకు వచ్చాయి. ఏ ఒక్క కేసుకూ శిక్ష పడలేదు. ఆ క్రెడిట్, పాపం అంతా మీనాయనదే. ఇప్పుడు నీ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. మా నియోజకవర్గంలో మూడు హత్యలు, గ్యాంగ్‌రేప్, దోపిడీలు జరుగుతున్నాయి. నువ్విచ్చిన ధైర్యంతో కాకపోతే తగరకుంట కొండారెడ్డి హత్యలో బాధితుల ఇళ్లకు ముద్దాయిలు వెళ్లి మాకు అనుకూలంగా సాక్ష్యం చెప్పాలంటూ బెదిరిస్తారా?. అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది. మహానటి మా పార్టీలో ప్రముఖుడైన కొడాలి నానికి సాష్టాంగ నమస్కారం చేసి తనకు టుప్లస్‌టు, తన ఉత్తుత్తి కుమారుడికి వన్‌ప్లస్‌వన్ గనెమెన్లను తెచ్చుకుంది. మైనింగ్ శాఖ కూడా ఆమె ఏది అడిగితే అది చేసింది. ఆమె సివిల్ సప్లయ్ కాంట్రాక్టులు కొనసాగాయి. ఆమె వద్ద ఓఎస్డీగా పని చేసిన ఓ అధికారి ఈ మధ్య మాట్లాడుతున్నాడంట. ఓ సీనియర్ నాయకుడు మా పార్టీలోకి వచ్చాడు. ఆ నాయకుడితో ఆ అధికారి చెప్పిందేమిటంటే ఇప్పుడు ఎన్నికలు జరిగితే కూడా జగన్ కు 150 సీట్లతో గెలుస్తాడని పరిటాల సునీతమ్మ చెప్పిందట. ఇదే విషయాన్ని సదరు నాయకుడు మా బాస్‌కు చెప్పాడు. ఇలాంటి ప్రేమ లేఖలు మా బాస్‌కు వస్తున్నాయంట. నాకు తెలిసింది మాత్రం ఈ ఒక్క లేఖేనప్పా. తెలీకుండా ఎన్ని లేఖలు వచ్చాయో నువ్వే చూసుకో లోకేషా. 2029లో ఎక్కడుంటారో ఏమో జాగ్రత్తపడు అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి హెచ్చరించారు.



## అణగారిన వర్గాల ఆశాజ్యోతి... వంగవీటి మోహనరంగా

**గుడివాడ వైయస్సార్ సిపి కార్యాలయంలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా 79వ జయంతి కార్యక్రమాలు-రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన వైఎస్ఆర్సిపి నాయకులు-కులం మతం చూడకుండా పేదల కోసం కృషి చేసిన వ్యక్తి రంగా ఆశయాలకు అనుగుణంగా కొడాలి నాని ఆధ్వర్యంలో ముందుకు వెళ్తాం.....వైఎస్ఆర్సిపి నాయకులు**



గుడివాడ, జులై 4 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహన రంగా 79వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక రాజేందర్ నగర్ లోని వైయస్సార్ సిపి కార్యాలయంలో కొడాలి నాని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాలేటి చంటి, ఎం.వి నారాయణరెడ్డి,అడబాల అప్పారావు పలువురు నేతలు రంగ చిత్రపటానికి పూలమాలలతో నివాళు లర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజా సమస్యల పరిష్కారానికి వంగవీటి మోహన రంగా ఎనలేని కృషి చేశారని కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు రంగాని ఆరాధించడం సంతోషంగా ఉందన్నారు. రంగా కేవలం ఒక వర్గానికి చెందిన నాయకుడు మాత్రమే కాదని పేదల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ,సమాజంలో సమానత్వం కోసం పోరాడిన మహనీయుడని ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని కొనియాడారు.పేదల కోసమే రంగా పనిచేశారని..ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.పార్టీలు,కులాలు, ప్రాంతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందని చెప్పుకొచ్చారు.ప్రజల మనిషి,పేదల నాయకుడు రంగా అని కొనియాడారు.ఓట్ల కోసం సిగ్గులేని రాజకీయాలు చేసే వ్యక్తులకు గుణపాఠం చెప్పాలని,రంగా అభిమానులు అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు రంగా ఆశయాలకు అనుగుణంగా, వైఎస్ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమ ధ్యేయంగా ఎంతో కృషి చేశారని,రంగా చూపిన మార్గాలే మాకు ఆదర్శప్రాయమని కొడాలి నాని ఆధ్వర్యంలో జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ముందుకు సాగుతామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాలేటి చంటి,ఎం.వినారాయణరెడ్డి,ఫర్నిచర్ పార్క్ బెన్ను, అడబాల అప్పారావు,వడ్లాని సుధాకర్,కొంకితల ఆంజనేయ ప్రసాద్, గంటా సురేష్,సింహాద్రి రాంబాబు,చుండూరి శేఖర్,అల్లం రామ్మోహన్,గంటా శీను,వంగలపూడి కనక బాబు,కలపాల కిరణ్,మెండా కిరణ్,కారే జోసెఫ్,ఎస్ కే బాజీ,షేక్ సయ్యద్, దుద్దు చిన్న,అలీ బేగ్,గుదే రవి,జ్యోతుల మణికంఠ,తోట సాయి,నరేంద్ర,నారాయణరెడ్డి,జోషి,వెంపల అప్పారావు, జివిస్టి భాష,అబ్దుల్ రజాక్,ఖాదర్ బేగ్,షఫీ,చింతా నాని, అడపా హర్ష,వన్నెంరెడ్డి దినేష్,సుంకర ప్రసాద్,తరుణ్,ఎన్ హర్ష,బ్రో నాగేంద్ర,నైనవరపు శేషు,రమణ కుమార్,జ్యోతుల సత్యవేణి,సురేఖ,హారిక,రమీజా,శేషం నిర్మల,రాణి,కళావతి, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ ను పరిశీలించిన చైర్ పర్సన్ బల్లా పల్లవి



అనంతపురం బ్యూరో జూలై 04 నేటి శుభోదయ:అనంతపురం నగర సమీపంలో శనివారం సంత జరుగుతున్న సందర్భంగా మార్కెట్ యార్డును చైర్ పర్సన్ బల్లాపల్లవి పరిశీలించారు. రైతులు వ్యాపారస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆమె ఆరా తీశారు. గత ప్రభుత్వంలో మార్కెట్లో ఎటువంటి రైతులకు, వ్యాపారస్తులకు ఎటువంటి వసతులు కల్పించలేదని తాను మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ గా ఎంపికైన తరువాత రైతులకు, వ్యాపారస్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నాం. పలు ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తున్నామని రాత్రి వేళల్లో రైతులు నిద్రించడానికి కొత్తగా ప్రత్యేకంగా షెడ్డును ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. పరిశీలించిన వారి లో మార్కెట్ యార్డ్ అధికారులు ఉన్నారు.ం

## స్వర్గీయ రంగా చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**-ఎమ్మెల్యే వెనిగండ్ల రాము--గుడివాడలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలు.-ఏజికే స్కూల్ సెంటర్‌లో రంగా విగ్రహానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమినేతల నివాళి.-ఏజికే స్కూల్ సెంటర్‌ను రంగా చౌక్‌గా అభివృద్ధి చేస్తామనీ..ఎమ్మెల్యే హామీ-రంగా అభిమానులకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తున్నా ఎమ్మెల్యే రాముకు ధన్యవాదాలు:కూటమి నేతలు**



గుడివాడ, జులై 4( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) స్వర్గీయ వంగవీటి మోహనరంగా చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరం యువతకు ఆదర్శప్రాయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. రంగా చూపిన మార్గాలు తనలాంటి ఎందరికో ఆచరణీయమని పేర్కొన్నారు. స్వర్గీయ వంగవీటి మోహనరంగా 79వ జయంతి వేడుకలను కూటమి పార్టీల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఏజికే స్కూల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నేతలతో కలిసి "జోహార్ వంగవీటి మోహనరంగా" అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జయంతి కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే రాము నాయకులకు తినిపించారు.రంగా అభిమానులకు మిఠాయిలు పంచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, "రంగా బడుగు బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడన్నారు. కార్మిక నేతగా, పేదల పక్షపాతిగా ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కూటమి ప్రభుత్వం రంగా లాంటి మహనీయుల ఆశయాల సాధనే లక్ష్యంగా పనిచేస్తోంది" అన్నారు. అభిమానుల విజ్ఞప్తి మేరకు ఏజికే స్కూల్ సెంటర్‌ను రంగా చౌక్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రముఖంగా ఉండేలా చౌక్‌లో రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గుడివాడ టీడీపీ అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య మాట్లాడుతూ రంగా అభిమానులకు రాజకీయ ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే రాముకు ధన్యవాదాలు తెలిపారు. ఏజికే స్కూల్ సెంటర్‌ను వంగవీటి మోహనరంగా చౌక్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు.జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ రంగా ఆదర్శాలను అందరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మురికి కూపంలా ఉన్న రంగా విగ్రహ పరిసరాలను అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు.జయంతి వేడుకల్లో జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు,గుడివాడ టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, కూటమి పార్టీల నాయకులు దారపు రెడ్డి మనీశ్వరరావు, పందిళ్ళ మల్లీ, చేకూరు జగన్మోహన్రావు,సందు పవన్, దేవాది నాగేశ్వరరావు, పంచకర్ల అమర్, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, వడ్డే గిరి, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, గుత్తా చంటి, యార్లగడ్డ సుధారాణి, కంచనపల్లి సుబ్రమణ్యం, వడ్డాది నాగరాజు, వసంతవాడ దుర్గారావు, బలసాని భవాని, రమేష్ చౌదరి, దాసరి మహేష్, పాండు, ఇమాన్యుల్, పంచకర్ల మహేష్, మాదాల సురేష్, సాయన రాజేష్, షణ్ముఖ రెడ్డి, పంచమర్తి శ్రీనివాసరావు, దారపురెడ్డి మహేశ్వరరావు , గొర్ల శ్రీలక్ష్మి, వంగకుండు ఆదినారాయణ, పాలసీ ఉమా, మద్దుకూరి ప్రభాకర్, బొంబాయి శ్రీను, మరిది రోహిణి,నాఖ మౌలాలి, సయ్యద్ జబీన్, పాండు, పులవర్తి డేవిడ్, కొడాలి రాజా, సమెట్ట వరుణ్, గుర్రాల అరవింద్,పైడిముక్కల వంశీ, పెద్ద సంఖ్యలో రంగా అభిమానులు పాల్గొన్నారు.

## బచ్చుల అర్జునుడు, వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వెంకట్రావ్



విజయవాడ, జులై 4 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) దివంగత టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ, మాజీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బచ్చుల అర్జునుడు, దివంగత ప్రజానేత వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా శనివారం విజయవాడలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ నాయకులతో కలసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, బచ్చుల అర్జునుడు పార్టీ కోసం జీవితాంతం అంకితభావంతో పనిచేసిన నాయకుడని, క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో కూడిన ఆయన రాజకీయ ప్రస్థానం ప్రతి కార్యకర్తకు ఆదర్శమని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని పే...

## కృష్ణా జిల్లా గూడూరులో విషాదం

**-ఒకే ఇంట్లో ముగ్గురు మహిళల ఆత్మహత్య**



పెడన, జులై 4 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ,) కృష్ణా జిల్లా గూడూరు మండలం అనంతాయిపేటలో ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు బలవన్మరణానికి పాల్పడిన ఘటన విషాదం నింపింది.పెడన నియోజకవర్గం పరిధిలోని అనంతాయిపేట గ్రామంలో రజని కుమారి (60), ఆమె కుమార్తె గౌరి దేవి (40), కోడలు హనుమకొండ మధుబాల (35) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని స్థానికులు తెలిపారు.స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న గూడూరు పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సమస్యల కారణంగానే వారు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆత్మహత్యకు గల అసలు కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## దేవాలయాల అభివృద్ధి ద్వారానే ధర్మం, సంస్కృతి నిలబడుతుంది

**--గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**-వేమవరం కొండలమ్మ ఆలయంలో దుకాణాల కాంప్లెక్స్ ప్రారంభించిన...**



గుడ్లవల్లేరు, జులై 4, ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) దేవాలయాల అభివృద్ధి ద్వారానే ధర్మం, సంస్కృతి నిలబడుతుందనీ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.కూటమి ప్రభుత్వ హయాంలో ఆలయాల్లో ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందిస్తున్నామని ఆయన చెప్పారు.గుడ్లవల్లేరు మండలం వేమవరంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో దాతల సహకారంతో నిర్మించిన ఎనిమిది దుకాణాల కాంప్లెక్స్ ప్రారంభ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.ధర్మకర్తల కమిటీ సభ్యులు, భక్తులు, దాతలతో కలిసి గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కాంప్లెక్స్‌ను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు మేళతాళాలతో దేవాదాయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంప్లెక్స్ నిర్మాణానికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే రాము శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ దాతల సహకారంతో కొండలమ్మ ఆలయం మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. ఇలాంటి కాంప్లెక్స్‌ల వల్ల భక్తులకు సౌకర్యాలు పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా వస్తాయన్నారు. ఆలయ ఆదాయం పెరిగి మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి ఉపయోగపడుతుందనీ ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందనీ ఉద్ఘాటించారు. కొండలమ్మ ఆలయాన్ని రాష్ట్ర స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిద్దడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ధర్మకర్తలు, దాతలు, భక్తులకు ఎమ్మెల్యే రాము ధన్యవాదాలు తెలిపారు.ప్రారంభోత్సవ వేడుకల్లో దేవస్థానం ధర్మకర్తల కమిటీ చైర్మన్ ఈడే మోహన్, ఈవో ఆకుల కొండలరావు,మండల టిడిపి అధ్యక్షులు పోలవరపు వెంకటరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, కార్పొరేషన్ డైరెక్టర్ సాయన పుష్పవతి, జగన్మోహన్రావు, కౌతవరం బ్యాంక్ చైర్మన్ యుగంధర్, గుడ్లవల్లేరు బ్యాంక్ ప్రెసిడెంట్ వెనిగళ్ళ నాగేశ్వరరావు, టిడిపి నాయకులు బొప్పన శివప్రసాద్, పెన్నేరు రమేష్, వల్లభనేని వెంకట్రావు, తోటా ప్రసన్న ఆంజనేయులు,గరికిపాటి రాంబాబు, కొడాలి రామరాజు, తోట రమేష్, మండల అధ్యక్షులు తోట చిన్నారి, ఈడే కృష్ణ, అంకాలరావు, అబ్దుల్ సత్తార్, పిచ్చేశ్వరరావు, పాగోలు అనిల్, గోవాడ శివ, పామర్తి సత్తిబాబు, తోట మల్లి,శశికళ, జీబ్రా బాబి, జానీ, మరియు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు దాతలు మండల ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**-ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



విజయవాడ, జులై 4,( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--ఎస్ఐఆర్)ను పకడ్బందీగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పార్టీ నాయకులకు సూచించారు. శనివారం విజయవాడలోని తన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా ప్రతి గ్రామంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా అన్ని ఎన్యూమరేషన్ ఫారాలను సేకరించి, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, కొత్త ఓటర్ల నమోదు, పేరు, చిరునామా మార్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన పత్రాల సమర్పణలో వారికి సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా ఈ ప్రక్రియను నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా సమన్వయంతో పనిచేయాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గుడివాడలో ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలు.



గుడివాడ, జులై 4 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను గుడివాడ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ వాసవి కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ స్టేట్ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వైశ్య సంఘ పెద్దలతో కలిసి డైరెక్టర్ సునీల్ రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం సునీల్ మాట్లాడుతూ, "రోశయ్య శాసనమండలి సభ్యుడిగా, ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించారనీ అన్నారు. ముఖ్యంగా ఆర్థిక మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాయన్నారు. ముఖ్యమంత్రిగా సంక్షోభ సమయంలో రాష్ట్రాన్ని సుస్థిరంగా నడిపించారనీ నాటి రోజులను సునీల్ గుర్తు చేశారు. గవర్నర్‌గా కూడా తనదైన ముద్ర వేశారన్నారు. వైశ్య కులానికి గర్వకారణంగా నిలిచిన రోశయ్య సేవలు, నిజాయితీ, పరిపాలనా దక్షత నేటి తరానికి ఆదర్శప్రాయం అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ వైశ్య సంఘం అధ్యక్షుడు జవాజీ గంగరాజు, వైశ్య సంఘ పెద్దలు బెజవాడ రాజేశ్వరావు, పైడి గోపి, చలువాది సురేష్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి




చింతూరు డివిజన్ నేటి శుభోదయ: చింతూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం చరిత్ర విభాగం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. రత్న మాణిక్యం ఆదేశానుసారం నిర్వహించడం జరిగింది. కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ ముల్లి. శేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న విశాఖపట్నం జిల్లాలోని పాండ్రంకి గ్రామంలో 1897 జులై 4వ తేదీన క్షత్రియ కుటుంబంలో జన్మించిన అల్లూరి సీతారామరాజు భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని గిరిజన ప్రజల అభివృద్ధికి కృషిచేసి ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యమనే మహాశక్తిని ఎదుర్కొన్న గొప్ప స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజుని తెలిపారు. రాజనీతిశాస్త్ర అధ్యాపకురాలు మాట్లాడుతూ అతి చిన్న వయసులో అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వారిని ఎదిరించారు అని తెలిపారు. చరిత్ర విభాగాధిపతి బి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అతి చిన్న వయస్సులోనే బ్రిటిష్ వారితో పోరాటానికి సిద్ధపడి తన ప్రాణాలను బలిదానం చేసిన సమరయోధుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్.వై. పద్మ, డాక్టర్. శకుంతల, ఎస్.అప్పనమ్మ, కే. శైలజ, జి.హారతి, ఎం. నాగమోహన్ రావు, ఎన్.ఆనంద్, కే. లక్ష్మీ ప్రసన్నకుమారి, కే.కీర్తి, ఆర్. మౌనిక, ఆర్. కిరణ్మయి తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**ఏ ఎస్పీ బొడ్డు హేమంత్**




చింతూరు డివిజన్ నేటి శుభోదయ: అల్లూరి సీతారామరాజు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని చింతూరు ఏఎస్పి బొడ్డు హేమంత్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏఎస్పీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో తెల్ల దొరలకు కునుకు లేకుండా చేసి, గిరిజనుల,అడవి, భూమి, నీరు హక్కుల కోసం బ్రిటిష్ సామ్రాజ్య ధోరల మీద యుద్ధం నడిపిన వ్యక్తి, సమూహ శక్తి అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. గిరిజనుల కు సామాజిక న్యాయం, గిరిజనుల హక్కుల కోసం పోరాడి, స్వాతంత్రం కోసం ప్రాణాలు వదిలిన మహానుభావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ



**చింతూరు డివిజన్ నేటి శుభోదయ:చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కె. రమేష్ బాబు గారు అధ్యక్షత వహించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యా సామగ్రిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమిస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసి విజయవంతంగా ముగించారు.**

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
ఆదివారం - 05 - జూలై - 2026

# మెడ వణుకుతోంది... కనీసం ఫోన్‌ను పట్టుకోలేకపోతున్నా!



ఆ యువతి తరచూ మెడ నొప్పి, చేతుల్లో బలం తగ్గిపోతున్న సమస్యతో డాక్టర్‌ను సంప్రదించింది. తన జీవనశైలి, రోజువారీ అలవాట్లు, ఉద్యోగ ఒత్తిడి, నిద్రపోయే భంగిమ.. ఇవన్నీ కారణాలేమోనని ఆమె ముందుగానే అనుకుంది. కానీ అన్ని వివరాలు విన్న తర్వాత డాక్టర్ చెప్పిన మాటలు ఆమెను ఆశ్చర్యంలో ముంచేశాయి. "అది సాధారణ అలసట కాదు... ఆమె శరీరం ఫోన్ ప్రభావానికి లోనవుతోంది" అనే వ్యాఖ్యతో అసలు సమస్యపై కొత్త చర్చ మొదలైంది. స్మార్ట్‌ఫోన్ వినియోగం ఇప్పుడు లింగ భేదానికి పరిమితం కాని సమస్యగా మారుతోందని నిపుణులు చెబుతున్నారు. గంటల తరబడి స్క్రీన్‌పై గడపడం వల్ల మెడపై ఒత్తిడి పెరగడం, భంగిమలో మార్పులు, చేతి బలం తగ్గడం వంటి లక్షణాలు యువతలో సాధారణంగా కనిపిస్తున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా పని, చదువు, వినోదం అన్నీ డిజిటల్ పరికరాలపైనే ఆధారపడటం వల్ల ఈ ప్రభావం మరింత విస్తరిస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇది ఒక్కరి సమస్య కాదు... ఆధునిక జీవనశైలి కలిగిస్తున్న సామూహిక ఆరోగ్య సవాలుగా మారుతోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు వంటి డిజిటల్ పరికరాలు మన శరీర ఆకృతినే నిశ్శబ్దంగా ప్రభావితం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. దీని వల్ల మెడ వంగిపోవడం, చూపు బలహీనపడటం, చేతి బలం తగ్గడం, మోటార్ స్కిల్స్‌పై ప్రభావం వంటి సమస్యలు పెరుగుతున్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.

పైగా ఈ మార్పులన్నింటినీ ఇప్పుడు నిపుణులు ఒక కొత్త పదంతో వివరిస్తున్నారు. అదే "ఫోన్ బాడీ ". అంటే.. ఫోన్ అధికంగా ఉపయోగించడం వల్ల శరీరంలో కనిపిస్తున్న మార్పులు, భంగిమలో వచ్చే మార్పుల సమాహారం అని దీని అర్థం. ఇది వైద్యపరంగా అధికారిక పదం కాకపోయినా.. ఆధునిక జీవనశైలి ప్రభావాన్ని వివరించేందుకు వాడుతున్నారు. బీబీసీ టెక్నాలజీ జర్నలిస్ట్ థామస్ జర్మైన్ తన తాజా వ్యాసంలో ఈ వివరాలను సమగ్రంగా వెల్లడించారు. అందులో నిపుణుల చెప్పిన వివరాల ప్రకారం సమస్య కేవలం "స్క్రీన్ టైమ్" మాత్రమే కాదు.. ఎక్కువ సమయం ఇంట్లో కూర్చొని ఫోన్, కంప్యూటర్‌లకు అతుక్కుపోవడం కూడా ప్రధాన కారణంగా మారుతోంది. ముఖ్యంగా పిల్లలు, యువతలో శారీరక చురుకుదనం తగ్గిపోవడం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తోందని హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మయోపియా (దూరం చూపు బలహీనత) కేసులు వేగంగా పెరుగుతున్నాయి. అయితే దీని ప్రధాన కారణం ఫోన్‌ను దగ్గరగా చూడటం మాత్రమే కాదని, బయట సమయం తగ్గిపోవడమే ముఖ్య కారణమని నిపుణులు చెబుతున్నారు. సహజ కాంతి కళ్ల ఆరోగ్యానికి సహాయపడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. మరోవైపు "టెక్ నెక్" అనే సమస్య కూడా వేగంగా పెరుగుతోంది. నిరంతరం తల వంచి ఫోన్ చూడటం వల్ల మెడపై తీవ్ర ఒత్తిడి పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తల వంచే కోణం పెరిగే కొద్దీ మెడపై పడే బరువు అనేక రెట్లు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీని వల్ల నొప్పులు, కండరాల గట్టిపడటం మాత్రమే కాకుండా భవిష్యత్తులో పోశ్చర్ మార్పులు కూడా రావచ్చని డెర్మటాలజీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక చేతి బలం విషయంలోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా యువతలో గ్రిప్ స్ట్రెంగ్త్ తగ్గుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది కేవలం చేతుల బలహీనత మాత్రమే కాకుండా మొత్తం శారీరక ఆరోగ్య సూచికగా పరిగణించబడుతోంది. టెక్నాలజీ మోటార్ స్కిల్స్‌పైనా ప్రభావం చూపుతోందని పరిశోధకులు చెబుతున్నారు. ఫోన్‌పై స్వైప్ చేయడం, క్లిక్ చేయడం వంటి పనుల్లో నైపుణ్యం పెరుగుతున్నప్పటికీ, చేతి-మెదడు సమన్వయంపై దీర్ఘకాలిక ప్రభావం ఉండొచ్చని హెచ్చరిస్తున్నారు. అయితే నిపుణులు భయపడాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు. రోజూ కొంతసేపు ఫోన్‌కు విరామం ఇవ్వడం.. కొన్ని అలవాట్లు మార్చుకుంటే "ఫోన్ బాడీ" ప్రభావాలను గణనీయంగా తగ్గించుకోవచ్చు.

### 20--20--20 రూల్

ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును కనీసం 20 సెకన్లు చూడాలని సూచిస్తున్నారు. ఇది కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.

### మెడ పోశ్చర్‌పై దృష్టి

ఫోన్‌ను కిందకి వంచి చూడకుండా, కంటి లెవెల్‌లో ఉంచుకోవడం ద్వారా "టెక్ నెక్" ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

### స్క్రీన్ టైమ్ పరిమితి

రోజులో నిర్దిష్ట సమయాన్ని మాత్రమే ఫోన్ వినియోగానికి కేటాయించడం మంచిదని నిపుణుల సూచన. అవసరం లేని స్క్రోలింగ్ తగ్గించాలి.

### శారీరక కదలికలు తప్పనిసరి

ప్రతి గంటకోసారి లేచి నడవడం, స్ట్రెచింగ్ చేయడం వల్ల కండరాల గట్టిపడటం తగ్గుతుంది.

### గ్రిప్ - చేతి వ్యాయామాలు

బంతి పట్టుకోవడం, స్ట్రెస్ బాల్ వాడడం, చిన్న హ్యాండ్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం చేతి బలం మెరుగుపరుస్తాయని చెబుతున్నారు.

### బయట గడిపే సమయం పెంచాలి

సహజ కాంతి కళ్ల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. రోజులో కనీసం కొంత సమయం బయట గడపడం మయోపియా ప్రమాదాన్ని తగ్గించగలదు.

### డిజిటల్ డీటాక్స్ అలవాటు

వారానికి ఒకసారి కొన్ని గంటలు ఫోన్ లేకుండా గడపడం మానసికంగా, శారీరకంగా ఉపశమనం ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తం మీద, ఫోన్ ఇప్పుడు మన జీవితంలో భాగంగా మారినప్పటికీ, అది శరీరంపై నెమ్మదిగా కానీ స్పష్టంగా ప్రభావం చూపుతోందని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. టెక్నాలజీని పూర్తిగా దూరం చేయలేకపోయినా, దాన్ని నియంత్రితంగా ఉపయోగించడం ద్వారా శరీరంపై దాని ప్రభావాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కంటి సమస్యలు ఉన్నవారు తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే.. వీటితో ఎన్నో ఉపయోగాలు..

కళ్లు పొడిబారడం (డ్రై ఐ సిండ్రోమ్) ప్రస్తుతం చాలా మందిలో కనిపిస్తున్న సాధారణ సమస్య. ఎక్కువసేపు కంప్యూటర్, మొబైల్ స్క్రీన్‌లను చూడటం, ఏసీ గదుల్లో ఎక్కువ సమయం గడపడం, వయస్సు పెరగడం, కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా పోషకాల లోపం వంటి కారణాల వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. దీనివల్ల కళ్లలో మంట, ఎర్రబడటం, మసకగా కనిపించడం, కనురెప్పలు అతుక్కుపోయినట్లు అనిపించడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే కొన్ని సహజమైన చిట్కాలు, సరైన ఆహారపు అలవాట్లు ఈ సమస్య నుంచి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. కళ్ల ఆరోగ్యానికి విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం అవసరం. ముఖ్యంగా విటమిన్ ఎ కంటి ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. క్యారెట్, బొప్పాయి, మామిడి, పాలకూర వంటి ఆకుకూరలు, పసుపు, ఎరుపు, ఆకుపచ్చ రంగు కూరగాయలను ఆహారంలో చేర్చడం వల్ల అవసరమైన పోషకాలు అందుతాయి. అలాగే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల కళ్లలో సహజంగా కన్నీటి ఉత్పత్తి మెరుగుపడి పొడిబారడం తగ్గే అవకాశం ఉంటుంది.

### ఈ చిట్కాలను పాటించాలి..

కొబ్బరి నూనె కూడా డ్రై ఐ సమస్యలో కొంత ఉపశమనం కలిగిస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, తేమను కాపాడే గుణాలు కళ్ల చుట్టూ ఉన్న చర్మాన్ని మృదువుగా ఉంచడంలో సహాయపడతాయి. రెండు నుంచి మూడు చుక్కల కొబ్బరి నూనెను కళ్ల చుట్టూ నెమ్మదిగా రెండు నుంచి మూడు నిమిషాలు మసాజ్ చేసి, చర్మం పూర్తిగా పీల్చుకునే వరకు వదిలేయాలి. అయితే నూనె నేరుగా కంట్లో పడకుండా జాగ్రత్త వహించాలి. కీరదోస ముక్కలను కళ్లపై ఉంచడం కూడా ఉపశమనం కలిగించే చిట్కాల్లో ఒకటి. చల్లగా ఉంచిన కీరదోస ముక్కలను 15 నిమిషాల పాటు కళ్లపై ఉంచితే మంట, దురద, ఎర్రదనం తగ్గడంలో సహాయపడుతుంది. కీరదోసలో ఉండే విటమిన్ ఎ కళ్లకు పోషణ అందించడంలో ఉపయోగపడుతుంది. రోజూ ఒక గిన్నె పెరుగు తినడం కూడా కళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పెరుగులో విటమిన్ డి, విటమిన్ బి, విటమిన్ ఎ వంటి పోషకాలు ఉండటంతో కళ్లకు అవసరమైన పోషణ అందించి పొడిబారడం వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.



### ఎక్కువ సేపు ఫోన్ లేదా కంప్యూటర్ చూస్తే..

కళ్లను తరచూ రెప్పవేయడం కూడా చాలా ముఖ్యమైన అలవాటు. రెప్పవేయడం వల్ల సహజంగా కన్నీటి పొర కంటి ఉపరితలంపై సమానంగా వ్యాపించి తేమను నిలబెడుతుంది. ముఖ్యంగా కంప్యూటర్ లేదా మొబైల్‌ను ఎక్కువసేపు ఉపయోగించే వారు ప్రతి కొద్ది నిమిషాలకు ఒకసారి రెప్పవేయడాన్ని అలవాటు చేసుకోవాలి. గోరువెచ్చని నీటిలో ముంచిన మెత్తని వస్త్రంతో కళ్లకు కాపడం పెట్టడం కూడా మంచి ఉపశమనం ఇస్తుంది. మెత్తని వస్త్రాన్ని గోరువెచ్చని నీటిలో ముంచి అదనపు నీటిని పిండి, కళ్లపై ఏడు నుంచి ఎనిమిది నిమిషాల పాటు ఉంచాలి. ఇలా చేయడం వల్ల కళ్ల చుట్టూ రక్తప్రసరణ మెరుగుపడి సహజమైన తేమ ఉత్పత్తికి దోహదపడుతుంది. అయితే కళ్లు పొడిబారడం ఎక్కువకాలం కొనసాగితే, తీవ్రమైన నొప్పి, చూపు తగ్గడం లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా వెంటనే నేత్ర వైద్యుడిని సంప్రదించడం అవసరం.

# ఆరోగ్యంగా ఉండాలంటే మందులను మింగడమే కాదు, పోషకాహారం తీసుకోవడం కూడా ముఖ్యమే..



ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మందులతోపాటు ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా కూరగాయల్లో ఉండే విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అవసరమైన పోషకాలను అందించి అనేక ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని కూరగాయలను క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి వంటి అంశాలకు మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కాలేయంలో కొవ్వు పేరుకుపోయే ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు కాలీఫ్లవర్‌ను ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇందులో ఉండే ఇండోల్స్, గ్లూకోసినోలేట్స్ వంటి సమ్మేళనాలు కాలేయం సహజంగా వ్యర్థాలను తొలగించడంలో తోడ్పడి, కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

### బీట్‌రూట్, కాకరకాయ, పాలకూర..

రక్తపోటు ఉన్నవారికి బీట్‌రూట్ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే సహజ నైట్రేట్లు శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి రక్తనాళాలను విస్తరించడంలో సహాయపడతాయి. దీంతో రక్తప్రసరణ మెరుగుపడి రక్తపోటు నియంత్రణకు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు కాకరకాయను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. ఇందులో ఉండే పోలీపెప్టైడ్-పీ, కారంటిన్ వంటి సమ్మేళనాలు సహజ ఇన్సులిన్ మాదిరిగా పనిచేసి గ్లూకోజ్ నియంత్రణకు దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో ఐరన్ లోపం ఉన్నవారికి పాలకూర మంచి ఎంపిక. ఇందులో ఐరన్‌తోపాటు ఫోలేట్ కూడా సమృద్ధిగా ఉంటుంది. ఇవి ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరం. పాలకూరతోపాటు నిమ్మరసం వంటి విటమిన్ సి అధికంగా ఉండే పదార్థాలను తీసుకుంటే ఐరన్ శోషణ మరింత మెరుగుపడుతుంది.

### ముల్లంగి, క్యారెట్..

జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారికి ముల్లంగి ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే పీచుపదార్థం మలబద్ధకాన్ని తగ్గించి పేగుల పనితీరును మెరుగుపరుస్తుంది. అలాగే పిత్తరసం విడుదలను ప్రోత్సహించడం ద్వారా కొవ్వు జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. కంటి ఆరోగ్యానికి క్యారెట్ ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే బీటా కెరోటిన్ శరీరంలో విటమిన్ ఎగా మారి కంటి చూపును కాపాడటంలో, కంటి ఉపరితలాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు క్యాప్సికమ్‌ను ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇందులో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఈ పోషకం తెల్ల రక్తకణాల ఉత్పత్తిని పెంచి ఇన్ఫెక్షన్లతో పోరాడేందుకు శరీరానికి సహాయపడుతుంది.

### తోటకూర, ఉసిరి..

చర్మం కాంతివంతంగా ఉండేందుకు తోటకూర ఉపయోగపడుతుంది. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించి చర్మానికి సహజమైన మెరుపును అందించడంలో తోడ్పడుతుంది. ఉసిరికాయను పోషకాహార నిపుణులు సూపర్‌ఫుడ్‌గా పేర్కొంటున్నారు. ఇందులో నారింజ రసం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉండటంతో రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా జుట్టు, గుండె ఆరోగ్యం, జీవక్రియకు కూడా మేలు చేస్తుంది. అయితే ఈ కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, ఇవి వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కావని గుర్తుంచుకోవాలి. ఇప్పటికే ఏదైనా వ్యాధికి చికిత్స పొందుతున్నవారు వైద్యుల సూచనల మేరకు మందులు కొనసాగిస్తూ, సమతుల్య ఆహారంలో భాగంగా ఈ కూరగాయలను చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు తెలియజేస్తున్నారు.

# 'ఏఐ'తో 'ఆట'లొద్దు

- మనుషులకంటే ఏఐ బాగా అర్థం చేసుకుంటుందనుకుంటున్న జనం
- ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్న 65 శాతం మంది భారతీయులు
- ఇది ప్రపంచ సగటు 31 శాతంతో పోలిస్తే రెండింతలకు పైగా ఎక్కువ
- చిన్నారుల్లో భారీగా పెరుగుతున్న ఏఐ వినియోగం
- పిల్లల్లో స్వయంగా ఆలోచించే శక్తి తగ్గిపోయే ప్రమాదం
- ఆందోళన కలిగిస్తున్న 'భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్--2025' గణాంకాలు

అమరావతి: కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రపంచవ్యాప్తంగా విద్య, ఆరోగ్యం, సమాచార రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. మన దేశంలోనూ ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. మైక్రోసాఫ్ట్ గ్లోబల్ ఆన్‌లైన్ సేఫ్టీ సర్వే--2024 ప్రకారం భారతీయుల్లో 65 శాతం మంది జనరేటివ్ ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఇది ప్రపంచ సగటు 31 శాతంతో పోలిస్తే రెండింతలకంటే ఎక్కువ. విద్యార్థులకు పాఠాలు అర్థం చేసుకోవడం, సందేహాల నివృత్తి, కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఏఐ ఉపయోగపడుతోంది. అదే సమయంలో పిల్లల మానసిక ఆరోగ్యం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత, గోప్యత వంటి అంశాలపై ప్రతికూల ప్రభావాలు చూపుతోంది. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ నిర్వహించిన 'భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్ 2025' అధ్యయనం తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే, ముగ్గురిలో ఒకరు వారి వ్యక్తిగత సమస్యలు, భావోద్వేగాలను ఏఐతో పంచుకుంటున్నారు. ఏఐతో వ్యక్తిగత విషయాలు చర్చించిన వారిలో 25 శాతం మంది 'మనుషుల కంటే ఏఐ నన్ను బాగా అర్థం చేసుకుంటుంది' అని భావిస్తున్నారు.

### ఆలోచనా శక్తిపై ప్రభావం

ఇదే సర్వేలో మరో ఆందోళనకర అంశం బయటపడింది. ఏఐ గురించి తెలిసిన పిల్లల్లో 75 శాతం మంది ఏఐ పనితీరుపై అవగాహన లేక దాన్నొక సెర్చ్ ఇంజిన్‌లా భావిస్తున్నారు. అలాగే 46 శాతం కుటుంబాలు ఏఐ వల్ల తప్పుడు సమాచారం (మిస్‌ఇన్‌ఫర్మేషన్) వచ్చే ప్రధాన ప్రమాదమని పేర్కొన్నాయి. ఏఐ వెంటనే సమాధానాలు అందించడం వల్ల పిల్లలు స్వయంగా ఆలోచించడం, సమస్యలను విశ్లేషించడం, పరిష్కారాలు కనుగొనడం వంటి నైపుణ్యాలను కోల్పోయే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు. హోంవర్క్, ప్రాజెక్టులు, వ్యాసాలు అన్నింటికీ ఏఐపై ఆధారపడితే సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం దెబ్బతినే అవకాశం ఉంది. యునిసెఫ్ నివేదికల ప్రకారం.. ఏఐ చాట్‌బాట్లతో ఎక్కువ సమయం గడిపే పిల్లల్లో ఒంటరితనం, భావోద్వేగ సంబంధాలు, సామాజిక సంబంధాలు తగ్గిపోవడం వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చు.

### 'ఏఐ' రూపంలో కొత్త ముప్పు

ఏఐ అందించే సమాచారం ఎల్లప్పుడూ సరైనదే కావాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు వాస్తవాలకు విరుద్ధమైన లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని కూడా అందించవచ్చు. చిన్నారులు దానిని నిజమని నమ్మే ప్రమాదం ఉంది. అలాగే వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, చాటింగ్ డేటా వంటి సమాచారాన్ని ఏఐ ప్లాట్‌ఫారమ్‌లలో పంచుకోవడం వల్ల గోప్యత సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా ఏఐ టెక్నాలజీతో డీప్‌ఫేక్ చిత్రాలు, వీడియోలు సృష్టించడం సులభమవుతోంది. అమెరికాలో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం 33 శాతం మంది టీనేజర్లు వారి అనుమతి లేకుండా వారి ఫొటోలను ఉపయోగించి డీప్‌ఫేక్ చిత్రాలు రూపొందించారని తెలిపారు. అలాగే 54 శాతం మంది ఇలాంటి కంటెంట్‌ను అందుకున్నట్లు చెప్పారు. యూకేలో 8 నుంచి 12 సంవత్సరాల పిల్లల్లో దాదాపు 22 శాతం మంది ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నట్లు అధ్యయనాలు వెల్లడించాయి. 40 శాతం కంటే ఎక్కువ మంది పిల్లలకు ఏఐ భద్రత గురించి తల్లిదండ్రులు ఎప్పుడూ వివరించలేదు. ఏఐ వాడే పిల్లల్లో 50 శాతం కంటే ఎక్కువ మంది ఆరోగ్యం లేదా శరీరానికి సంబంధించిన సలహాల కోసం చాట్‌బాట్లను ఆశ్రయిస్తున్నారు. ఆరుగురిలో ఒకరు (సుమారు 17 శాతం) ఏఐ ద్వారా అనుచిత కంటెంట్ చూశామని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల విద్య, మానసిక అభివృద్ధిపై ప్రభావం ఉంటుందనే ఆందోళనతో కొన్ని దేశాలు పాఠశాలల్లో ఏఐ వినియోగంపై నియంత్రణ విధించాలని భావిస్తున్నాయి. కానీ ఏఐను పూర్తిగా నిరోధించడం సాధ్యం కాదు. పిల్లలు దానిపై పూర్తిగా ఆధారపడకుండా, ఇతర మంచి విషయాలవైపు మళ్లేలా వారికి మార్గనిర్దేశం చేయాలి. అలాగే తప్పుడు సమాచారం, గోప్యత, డీప్‌ఫేక్ ముప్పుల గురించి అవగాహన కల్పించడం అవసరం. ఏఐ టెక్నాలజీ భవిష్యత్తును మార్చగల శక్తివంతమైన సాధనం. అయితే నియంత్రణ లేకుండా వినియోగిస్తే పిల్లలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

### భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్--2025 అధ్యయనం ప్రకారం ఏఐ వినియోగం ఇలా..

జనరేటివ్ ఏఐ టూల్స్ వినియోగిస్తున్న విద్యార్థులు -- 35 శాతం
వీరిలో సందేహాల నివృత్తికి -- 73 శాతం
కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడానికి -- 48 శాతం
పరీక్షల సన్నద్ధతకు -- 32 శాతం

### అమెరికాలో కామన్‌సెన్స్ మీడియా 2026 అధ్యయనం ప్రకారం..

9 నుంచి 17 సంవత్సరాల పిల్లల్లో ఏఐ వినియోగిస్తున్న వారు -- 86 శాతం
వీరిలో నిత్యం ఏఐతో మమేకమయ్యే వారు -- 25 శాతం
ఏఐ కంపానియన్ చాట్‌బాట్ల ఉపయోగించే టీనేజర్లు -- 72 శాతం
రోజూ వాటితో మాట్లాడేవారు -- 13 శాతం




NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .